
www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 205 | శనివారం | 4 జనవరి, 2025



## ఎల్లుండి చర్లపల్లి టెర్మినల్‌కు అంకురార్పణ

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- చర్లపల్లిలో కిషన్ రెడ్డి.. కశ్మీర్‌లో అశ్వినీ వైష్ణవ్ హాజరు



02



# ఆదాయం లేదు

## రాబడి సరిపోవడం లేదు

ప్రతినెలా 18,500 కోట్ల ఆదాయం..

కనీస అవసరాలకే 22,500 కోట్లు అవసరం

- సమస్యల పరిష్కారానికి ధర్నాలే అవసరం లేదు.. చర్చలతో పరిష్కరించొచ్చు

### సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదు

రెగ్యులరైజ్ కోసం పట్టుబడితే సమస్య పెరుగుతుంది

- గత పదేళ్లలో భ్రష్టుపట్టిన పరిపాలన.. అధికారంలోకి రాగానే గాడిన పెట్టాం
- అప్పుల కారణంగా మరిన్ని పనులు చేపట్టలేకపోతున్నాం
- గెజిటెడ్ ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** 'ప్రభుత్వానికి ఆదాయం లేదు.. ప్రతినెలా వస్తోన్న రాబడి సరిపోవడం లేదు.. ఆర్థిక పరిస్థితిలో మార్పులు తెచ్చేందుకు సమయం పడుతుంది'. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో సీఎం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయిందని, దీంతో పలు సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నట్లు చెప్పారు. ప్రతి నెలా ప్రభుత్వానికి రూ. 18,500 కోట్ల ఆదాయం వస్తోందని, అది సరిపోవడం లేదన్నారు. కనీస అవసరాలకే ప్రతి నెల రూ.22,500 కోట్లు కావాలన్నారు. ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు తీసుకురావడానికి ఇంకాస్త సమయం పడుతుందన్నారు.

మిగతా 2 లో



## ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02

## విచారణకు రండి

- కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు
- ఎల్లుండి ఏసీబీ.. 7న ఈడీ ఆఫీసుకు..

03



## వీడిన ముగ్గురు విద్యార్థినుల మిస్సింగ్ మిస్టరీ



- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

02

# తెలుగువారంతా ఒక్కటే..

### రెండు రాష్ట్రాల కంటే విదేశాల్లో ఉండే తెలుగువారే ఎక్కువ

- మనోళ్లు ఎక్కడున్నా రాణిస్తున్నారు
- నాలెడ్జ్ ఎకనామీలో దూసుకెళ్తున్నారు
- ఐక్యంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలి
- తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టాలి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరు
- రేపు సభకు రేవంత్ వస్తారన్న చంద్రబాబు

**ప్రజానావ, హైదరాబాద్:** నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువారు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగు వాళ్లు అందిపుచ్చు కోవాలన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలను చంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో



## అప్పుడు బీసీ బిడ్డ ఈటలను గెంటేశారు

- పదేండ్లలో ఎప్పుడూ మాట్లాడలేదు
- ఇప్పుడు బీసీలపై మొసలి కన్నీరు కారుస్తున్నారు
- అధికార మత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారు
- కవితపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్

03



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- ఉదయం ప్రత్యేక దళాలు కూంబింగ్



03

## హాస్టల్ వ్యవహారంపై ముమ్మర దర్యాప్తు

- వేలిముద్రలు సేకరించిన పోలీసులు
- ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు

03

## రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ బొంద పెట్టింది

- రైతులు యాచించాలని రేవంత్‌రెడ్డి కుట్ర
- బీఆర్ఎస్‌ప్రభుత్వం రైతును రాజు చేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



03

## ఇది కోతల ప్రభుత్వం

- రైతు భరోసాపై మరోమారు మోసం చేసే యత్నం
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

03



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# ఎల్లుండి చర్లపల్లి టెర్మినల్‌కు అంకురార్పణ

**ప్రజానావ, హైదరాబాద్:** ఆధునికీకరించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన దీన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 6వ తేదీన ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారు. దీంతో సికింద్రాబాద్‌పై భారం తగ్గనుంది. రైళ్లను ఇక చర్లపల్లి వరకు కొనసాగిస్తారు. గత ఏడాది డిసెంబరు 28న ఈ టెర్మినల్‌ను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌ల చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది. కశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు చేపట్టిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా ప్రాజెక్టులో కీలక పనులు గత నెలలో పూర్తయ్యాయి. దీంతో దేశంలో మిగతా ప్రాంతాల నుంచి కశ్మీర్ లోయకు రైళ్లు నడిపేందుకు మార్గం సుగమమైంది. ఈ అనుసంధాన ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రధాని మోదీతో ఈ నెల 6వ తేదీన ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా చర్లపల్లి టెర్మినల్‌ను కూడా ప్రారంభించాలని ప్రధానిని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌లు కొద్దిరోజుల క్రితం కలిసి కోరగా అందుకు ఆయన అంగీకరించారు. చర్లపల్లిలో జరిగే ప్రారంభోత్సవంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కశ్మీర్‌లో జరిగే కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొంటారు. కశ్మీర్‌కు ఓ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు, రెండు మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించే అవకాశం ఉంది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రైలును ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఈ రైలు కాజీపేట స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాల సమాచారం. ఈ రైలును ప్రవేశపెట్టడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## నేను ఎలా జీవిస్తున్నానో ప్రజలకు తెలుసు

### కావాలంటే అద్దాల మేడలో ఉండేవాడ్ని : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** మోదీ తన కోసం ఏమీ నిర్మించుకోలేదన్న విషయం ఈ దేశ ప్రజలకు తెలుసు అని, కానీ పేద ప్రజల కోసం మాత్రం నాలుగు కోట్ల ఇళ్లు నిర్మించినట్లు ప్రధాని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. నేను కూడా అద్దాల మేడ కట్టుకునేవాడిని అంటూ ఆమ్ ఆద్మీ పార్టీని ఆయన విమర్శించారు. ఇటీవల నిర్మించిన ఢిల్లీ సీఎం నివాసం కోసం భారీ మొత్తంలో ఖరీదైన వస్తువులను వాడారు. దానిపై ఆరోపణలు వస్తున్నాయి. పబ్లిక్ వర్క్స్ శాఖ రిలీజ్ చేసిన ఇన్వెంటరీలో విస్తుపోయే లెక్కలు ఉన్నాయి. సీఎం బంగ్లా కోసం చాలా హైఎండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల్ని వాడినట్లు ఉన్నది. దీంతో బీజేపీ, ఆమ్ ఆద్మీ మధ్య రాజకీయ వేడి చెలరేగింది. గత పదేళ్ల నుంచి ఢిల్లీని ఆపద చుట్టేసిందని, అన్నాహజారేను ముందు పెట్టి, కొందరు నిజాయితీలేని వాళ్లు ఢిల్లీని ఆపదలోకి నెట్టేశారని, ఆప్ పార్టీ.. ఢిల్లీపై ఆపదలా పడి, మొత్తం దోచేసుకుంటోందని ప్రధాని విమర్శించారు. రాజకీయ, ఆర్థిక స్థిరత్వానికి ఇండియా సింబల్‌గా మారిందన్నారు. 2025లో భారత పాత్ర మరింత బలపడిందన్నారు. ఈ ఏడాది ప్రపంచ పట్టికలో ఇండియాను మరింత ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. ఇండియాను అతిపెద్ద ఉత్పత్తి దేశంగా మార్చాలన్నారు. ఢిల్లీ అభివృద్ధికి ఇది చాలా ముఖ్యమైన రోజు అని ప్రధాని మోదీ తన ట్వీట్‌లో వెల్లడించారు. జుగ్గి-జోప్రి అర్బన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు చెందిన 1675 ఫ్లాట్లను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. అశోక్ విహార్ ఏరియాలోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్‌లో నిర్మించిన ఈబ్ల్యూఎస్ ఫ్లాట్లకు చెందిన లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు.

## మహిళా సాధికారతలో సావిత్రీబాయి పూలే మార్గదర్శి: మోదీ



**న్యూఢిల్లీ:** మహిళా సాధికారతలో సావిత్రీబాయి పూలే మార్గదర్శి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు ప్రధాని నివాళులర్పించారు. ఆమె విద్య, సామాజిక సంస్కరణల రంగంలో అగ్రగామి, మహిళా సాధికారతలో మార్గదర్శి అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడంలో మాకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. 1831లో మహారాష్ట్రలో జన్మించిన ఆమె సంఘసంస్కర్త జ్యోతీరావు పూలేను వివాహం చేసుకున్న తర్వాత మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలను ప్రారంభించారు. మహిళలకు విద్యను అందించడంలో విశేష కృషి చేశారు. భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచారు.

## వీడిన ముగ్గురు విద్యార్థినుల మిస్సింగ్ మిస్టరీ

**ప్రజానావ, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా నవీపేట్ లో ముగ్గురు పదో తరగతి విద్యార్థినుల మిస్సింగ్ కలకలం రేపింది. ఈ కేసును సీరియస్ గా పరిగణించిన పోలీసులు విస్తృతంగా గాలించి కేసు మిస్టరీని ఛేదించారు. వివరాల్లోకి వెళితే.. నవీపేట్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొండపల్లి శిరీష, మేడం వరలక్ష్మి, గడ్డం రవళిక ముగ్గురు గురువారం పాఠశాలకు వెళ్లి, రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే నవీపేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. తప్పిపోయిన బాలికల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొండపల్లి శిరీష ఆచూకీ శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో నిజామాబాద్ బస్టాండ్‌లో లభించింది. బాలిక ద్వారా ఆరా తీసిన పోలీసులు మిగిలిన ఇద్దరు బాలికలను వేము లవాడ ప్రాంతంలో గుర్తించారు. విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో మి స్సింగ్ కథ సుఖాంతమైంది. విద్యార్థినుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతామని రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని పలు మండలాలలో పూర్తయిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం విద్య వైద్యరంగం అభివృద్ధికై దృష్టి సారించిందని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు తమ ప్రభుత్వంలోనే కాస్మెటిక్ ఛార్జీలు పెంచిందని, గత ప్రభుత్వం ఈ పని చేయలేక పోయిందని విమర్శించారు. కలెక్టర్ పనితీరు బాగుందని, ఆయన హయాంలో జిల్లా కేంద్రం అభివృద్ధిలో దూసుకుపోవాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధికి కావాల్సిన నిధులను తీసుకువచ్చి ముఖ్యమైన పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు కావలసిన చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగూడెం మైనింగ్ కళాశాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కలెక్టర్ జితేష్ పాటిల్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, చింతలపూడి రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, ఇతర శాఖ అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయం లేదు.. రాబడి సరిపోవడం లేదు

మొదటి పేజీ తరువాయి

గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పరిపాలన వ్యవస్థను భ్రష్టు పట్టించిందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిపాలన వ్యవస్థను పునరుద్ధరించే ప్రయత్నం చేశామని ఉద్ఘాటించారు.. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు సీఎం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టకాలంలో బాధ్యతలు చేపట్టిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక రాష్ట్రంలో మీరు ఎదుర్కొన్న ఇబ్బందులు అందరికీ తెలుసునని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో ఒక గొప్ప అవకాశం తమ ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల మొదటి తేదీన జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంపై ఆధారపడి ప్రజల కోసం పనిచేసే వారికి ప్రతీ నెలా మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల ప్రభుత్వానికి ఆదాయం లేకపోవడంతో కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని వెల్లడించారు. ‘ప్రతీ నెల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.18500 కోట్లు. ఇది ప్రభుత్వ అవసరాలకు సరిపోవడం లేదు. అన్నీ సక్రమంగా నిర్వహించాలంటే రూ.30వేల కోట్లు కావాలి. వచ్చే ఆదాయంలో రూ.6500కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అవసరాలకు చెల్లిస్తున్నాం. మరో రూ. 6500 కోట్లు ప్రతీ నెల అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి. మిగిలిన రూ. 5500 కోట్లలో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన పరిస్థితి. కనీస అవసరాలకు ప్రతీ నెల రూ. 22500 కోట్లు కావాలి. వచ్చిన ఆదాయంతో పోలిస్తే రూ.4000 కోట్లు తక్కువ పడుతోంది. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేర్చేది ఉద్యోగులే. మేము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో సామాజిక మార్పును తీసుకొచ్చాం. ఆర్థికపరమైన మార్పులు తీసుకురావాలంటే ఇంకా కొంత సమయం పడుతుంది. రాష్ట్ర ఆదాయాన్ని పారదర్శకంగా ఖర్చు చేసేందుకు మీరు ఎలాంటి సలహాలు ఇచ్చినా తీసుకుంటాం‘ అని సీఎం పేర్కొన్నారు. ‘ఈ ప్రభుత్వం మనది?ఆదాయాన్ని పెంచాలన్నా, పెంచిన ఆదాయం పంచాలన్నా మీ చేతుల్లోనే ఉంది. మీ సమస్యలు చెప్పండి? పరిష్కారానికి కార్యాచరణ చేపడతాం. ఈ ప్రభుత్వం మీ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరిస్తుంది. సమస్యల పరిష్కారానికి మీరు ధర్నాలే చేయాల్సిన అవసరం లేదు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి. రాజకీయాల కోసం కొందరు నిరసనలు, ధర్నాలకు ప్రేరేపిస్తున్నారు. వారి ఉచ్చులో పడితే చివరకు నష్టపోయేది మీరే. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మాకు ఉన్నా చేయలేని పరిస్థితి. సర్వశిక్షా అభియాన్ కేంద్ర ప్రభుత్వ స్కీమ్. ఆ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే న్యాయస్థానాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అవకాశం లేకపోయినా రెగ్యులరైజ్ చేయాలని పట్టుబడితే సమస్య పెరుగుతుంది తప్ప పరిష్కారం కాదు. మిమ్మల్ని కష్టపెట్టి మీకు నష్టం కలిగే పనులు మా ప్రభుత్వం చేయదు‘ అని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఓ అధ్యక్ష్యుడు ఏలూరి శ్రీనివాసరావు, టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ,సహ అధ్యక్ష్యుడు శ్యామ్, రాష్ట్ర నేతలు ఉపేందర్ రెడ్డి, జగన్మోహన్ రావు, లక్ష్మణ్ గౌడ్, కృష్ణాయాదవ్, సహదేవ్ ,రామకృష్ణ గౌడ్, దీపారెడ్డి,సుజాత, పరమేశ్వర్ రెడ్డి, అస్నాల శ్రీనివాస్ 33 జిల్లాల టీజీఓ అధ్యక్ష్య,కార్యదర్శులు పాల్గొన్నారు.



## చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

### ప్రతి ఒక్కరూ పూలేను ఆదర్శంగా తీసుకోవాలి : రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, సోమాజిగూడ:** ప్రతి ఒక్కరూ చదువుల తల్లి, భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఆమె విద్యాభివృద్ధికి కెంతో కృషి చేశారని కొనియాడారు. ఆ రోజుల్లోనే మహిళా సాధికారిత కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. శుక్రవారం ఆమె జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆ మహనీయురాలికి నివాళులు అర్పించారు. జూబ్లీ హిల్స్‌లోని సీఎం నివాసంలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సామాజిక అసమానతలు, లింగ వివక్ష వంటి అనేక సామాజిక రుగ్మతలపై సావిత్రీబాయి పూలే అనేక పోరాటాలు చేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు- సమాజ హితం కోసం ఆ మహనీయురాలు చేసిన సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కాగా, మహిళలు, ఆడపిల్లల చదువు కోసం చేసిన విశేష సేవలకు గానూ ప్రతి ఏటా జనవరి 3న వారి సేవలు స్మరించుకుంటూ అధికారికంగా టీచర్స్ డే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# త్వరగా ట్రిపుల్ ఆర్ భూసేకరణ

- నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్‌లో త్వరగా పూర్తి
- అటవీ, ఆర్‌అండ్‌బి అధికారులతో సమన్వయం
- రెండు శాఖల్లో ఒక్కో అధికారి నియామకం
- ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బిటి రోడ్డు
- రీజినల్ రింగ్ రోడ్డుపై సమీక్షలో సిఎం రేవంత్

**ప్రజానావ, సోమాజిగూడ:** రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్ కోసం జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.సచివాలయంలో ఆర్‌ఆర్‌ఆర్, జాతీయ, రాష్ట్ర రహదారులపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. భూ సేకరణపై అటవీ శాఖ పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అటవీ, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, రెండు శాఖలు ప్రత్యేక అధికారులను నియమించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని రోడ్డు వెడల్పు ఉండేలా డిజైన్ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం విడతల వారీగా నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. నాగ్ పూర్-విజయవాడ కారిడార్‌కు సంబంధించి తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీశాఖ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అటవీశాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని,రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ఇందుకు ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. రెండు శాఖలు సమావేశమై సంబంధిత శాఖల పరిధిలోని భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండే విధంగా డిజైన్ చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలతో సహా ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాల్సిందేనని ఆదేశించారు. ఇందుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక ఏ గ్రామానికి రోడ్డు లేదనే మాట వినబడొద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు.



# తెలుగువారంతా ఒక్కటే..




మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ... ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలిసారి ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ‘అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు..శ్రీకాకుళం నుంచి పాలమూరు వరకు ఎక్కడ ఉన్నా తెలుగువారంతా ఒక్కటే.. అదే తెలుగుజాతి. తెలంగాణ, ఏపీ, ఆస్ట్రేలియా, అమెరికా.. ప్రపంచ నలు మూలల నుంచి ఇక్కడకు వచ్చారు. వివిధ దేశాల సమాఖ్యల అధ్యక్షులు ఇక్కడకు వచ్చారు. నా జీవితంలో ఇది ఎంతో సంతోషకరమైన రోజు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నాం. తెలుగు భాష, సంప్రదాయాలు, సంస్కృతిపై ఇష్టం, గౌరవంతో ప్రపంచ నలుమూలల నుంచి ఈ కార్యక్రమానికి వచ్చారు. నిజం చెప్పాలంటే.. ఏపీ, తెలంగాణలో ఉండే తెలుగువారికంటే భాష, సంప్రదాయాలను కాపాడేది విదేశాల్లో ఉండే తెలుగువారేనని అన్నారు. ‘ఏం చేయాలన్నా ఒక దూరదృష్టి ఉండాలి. ఒక నిర్దుష్టమైన ఆలోచన ఉండాలి. భవిష్యత్‌లో జరగబోయే విషయాలను మనం ముందుగానే ఆలోచించాలి. తగిన విధంగా ముందుకు వెళ్లగలిగితే ఏదైనా సాధ్యమే. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ. 25 సంవత్సరాల్లో ఇది సాధ్యమైంది. తెలుగు వారు ఎక్కడున్నా రాణిస్తున్నారు. 1996లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చాను. ఐటీ తిండి పెడుతుందా అని అప్పట్లో ఎంతో మంది హేళన చేశారు. సెల్‌ఫోన్లు ప్రమోట్ చేస్తే.. ఏమన్నా ఉపయోగమా? అని ప్రశ్నించారు. కానీ ఈరోజు నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువారు దూసుకెళ్తున్నారు. ఐటీలో రాణిస్తున్నవారు తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టాలి. ఆనాడు తెదేపా ప్రభుత్వం వేసిన పునాది కారణంగానే ఇక్కడ ఆదాయం పెరిగింది. చదువు, సంపద, జనాభాకు అవినాభావ సంబంధం ఉంటుంది. కొన్ని దేశాల్లో జనాభా రేటు తగ్గిపోతోంది. జపాన్, జర్మనీ దేశాలు భారతీయుల వైపు చూస్తున్నాయన్నారు. ‘దేశ విదేశాల్లో తెలుగువారు గొప్పగా రాణిస్తున్నారు. తెలుగువారు ఎక్కడున్నా పరస్పరం సహకరించుకోవాలి. ఐక్యంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలి. ఏఏ రంగాల్లో అవకాశాలు ఉన్నాయో తెలుగువారికి బాగా తెలుసు. విజన్ 2047తో ముందుకెళ్తున్నాం. 2047 నాటికి మనం ప్రపంచంలోనే మొదటి, రెండో స్థానంలో ఉంటాం. చిన్న ఆలోచనతో అనేక మంది తెలుగువారు కోటీశ్వరులు అయ్యారు. చిన్న ఆలోచనతో ర్యాపిడోను స్థాపించి గొప్పగా రాణించారు. కో-వర్కింగ్ స్పేస్ ద్వారా వేలమందికి ఉపాధి కల్పిస్తున్నారు. వినూత్నంగా ఆలోచిస్తే మరింత రాణిస్తారు. జీరో పావర్టీ మన లక్ష్యం కావాలి. 90 దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందించిన ఘనత మనది. టాప్-10లో ఉన్న తెలుగు పారిశ్రామికవేత్తలు ఇతరులకు మెంటార్‌గా ఉండాలి. ఎక్కడున్నా.. ఎలా ఉన్నా.. పుట్టిన రాష్టాన్ని మర్చిపోవద్దు. ఇప్పుడు చేయాల్సింది హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్. టెక్నాలజీని సరిగా వినియోగించుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చు. తెలుగు వారికి గౌరవం తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్. తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి ఎంతో సేవ చేశారు. తెలుగు భాష వికాసానికి రామోజీరావు ఎంతో కృషి చేశారు‘ అని చంద్రబాబు అన్నారు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని సంఘటిత పరిచి.. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలు, సంప్రదాయ విలువలు, తెలుగు జాతి వారసత్వ సంపదను పరిపుష్టం చేస్తూ నేటితరం, భావితరాలకు అందించే లక్ష్యంతో సమావేశాలు, చర్చలు, సమాలోచనలు, కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వివిధ రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు, సినీ నటులు, విదేశాల్లో ఉన్న తెలుగు సంఘాల ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరయ్యారు. 5వ తేదీన జరిగే ముగింపు వేడుకలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు అవుతారని సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్ తెలిపారు. ప్రపంచ తెలుగు సమాఖ్యకు 1993లో శ్రీకారం చుట్టారు. తొలి మహాసభలు 1996లో హైదరాబాద్‌లో జరిగాయి. దాదాపు 30 ఏళ్లకు మళ్లీ ఇప్పుడు రెండోసారి నగరంలో నిర్వహిస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై, దిల్లీ, సింగపూర్, దుబాయ్, మలేసియాలలో మహాసభలు జరిగాయి.



# అప్పుడు బీసీ బిడ్డ ఈటలను గెంటేశారు

- పదేండ్లలో ఎప్పుడూ మాట్లాడలేదు
- ఇప్పుడు బీసీలపై మొసలి కన్నీరు కారుస్తున్నారు
- అధికార మత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారు
- కవితపై మంత్రి పొన్నం ప్రభాకర్‌ఫైర్



**ప్రజానావ, హైదరాబాద్:** అధికారమత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారని...పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్ల మొసలి కన్నీళ్లు పెట్టుకుంటున్నారని...బిసి బిడ్డ ఈటెల రాజేందర్‌ను మెడపట్టి గెంటిన విషయం మరచి పోయారన,కవిత బిసి డిక్లరేషన్‌పై మంత్రి పొన్న ప్రభాకర్ ఎద్దేవా చేశారు. బీసీ డిక్లరేషన్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బీసీల కోసం మాట్లాడుతున్నందుకు సోదరి కవితకి అభినందనలు అని అన్నారు. నాయకత్వం మధ్య గ్యాప్ ఉందనే కవిత మీటింగ్ పెట్టారని వ్యాఖ్యలు చేశారు. కవిత గతంలో బతుకమ్మ, తర్వాత జాగృతి ఇప్పుడు బీసీ నినాదం అందుకున్నారన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..కొందరికి అధికారం మత్తు దిగి మస్తు గుర్తుకొస్తాయంటూ సెటైర్ విసిరారు. బీఆర్ఎస్ తమ పార్టీ పదవుల్లో బీసీలకు అవకాశమివ్వాలన్నారు. పార్టీ ఓనర్లలో తాను ఒకడిని అని ఈటెల రాజేందర్ అన్నందుకు మెడలు పట్టి బయటకి పంపారని విమర్శించారు. కవిత చేసే పనికి కొంత సంతోషం, కొంత బాధ కలుగుతోందన్నారు. పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్లు ఈరోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వకుండా తొక్కి పెట్టిన వాళ్లు ఈరోజు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మా పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయమైతే పార్టీలో చర్చిస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌లో బీసీలకు అన్యాయం జరిగితే మాట్లాడే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. బీసీల శక్తి గుర్తించారు కాబట్టే కవిత బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కవిత మీటింగ్‌కు జనాల కోసం బ్రతిమాలాడుతున్నారని సెటైరికల్ కామెంట్స్ చేశారు. న్నికల సమయంలో తప్పా బీఆర్ఎస్ బీసీల కోసంఏమైనా చేసిందా అని నిలదీశారు. ప్రగతి భవన్‌కు జ్యోతి రావ్ పూలే పేరు పెట్టుకున్నామని.. సావిత్రిభాయి పూలే జయంతిని మహిళా టీచర్ల దినంగా ప్రకటించామని తెలిపారు. కులగణన రిపోర్ట్ పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని చెప్పారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవరెంతో వారికి అంత అని రాహుల్ చెప్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీసీలను ఉపయోగించుకుంటే ఊరుకోమని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే స్ఫూర్తి

### కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

### జ్యోతిబా పూలే జయంతి అంటే ఆడబిడ్డల పండుగ : ఎంఎల్‌సీ కవిత



**ప్రజానావ, హైదరాబాద్:** కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆమె కోరారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్‌లో నిర్వహించిన బీసీ సంఘాల మహాసభలో ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే సతీమణి సావిత్రిబాయి పూలే 194వ జన్మదినమని, దేశంలోని ఆడబిడ్డలందరికీ నేడు పండగ దినమని కవిత చెప్పారు. సావిత్రబాయి పూలే పులి బిడ్డ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. "సావిత్రిబాయిపూలే ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. చరిత్ర తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తు నిర్మాణం చేస్తారన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో బీసీలకు ఏం జరిగిందో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. చాలా మంది కులం లేదని, కులరహిత సమాజం నిర్మిస్తామని గొప్పగొప్ప మాటలు చెప్తారు, కానీ భారతదేశంలో కులాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కులాల ఆధారంగానే జీవిస్తున్నారన్నారు. అందుకే ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం రాసిన పెద్దలు కొన్ని హక్కులు కల్పించారని కవిత గుర్తు చేశారు. రాజ్యాంగం రాసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు దేశ ప్రజలందరూ చేతిలెత్తి మొక్కాలన్నారు. ఆయన హక్కులు కల్పించకపోతే ఎస్సీ, ఎస్టీలకు ఇప్పటికీ ఎటువంటి ఫలాలు దక్కేవి కాదని పేర్కొన్నారు. అలాగే బీసీలోని అన్ని కులాలకు రాజ్యాంగంలో రక్షణ కల్పిస్తే బాగుండేదని అన్నారు. 1953లో అప్పటి ప్రధాని నెహ్రూ బీసీలపై అధ్యయనం చేయడానికి కాకా కాలేల్కర్ కమిషన్ వేశారని, పాపం ఆ పెద్దమనిషి రెండేళ్లు శ్రమించి రిపోర్టు ఇస్తే నెహ్రూ దాన్ని తిరస్కరించారన్నారు. ఇది చరిత్ర, కాదనలేని వాస్తవం. మండల్ కమిషన్ రిపోర్టును పదేళ్లపాటు బీరువాలో పెట్టారన్నారు. మండల్ కమిషన్ రిపోర్టును వీపీ సింగ్ అమలు చేస్తే ఆయన ప్రభుత్వాన్ని కూలగొట్టారని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం విచ్ఛినం అవుతుందని ఆనాడు రాజీవ్ గాంధీ చెప్పలేదా?. బీసీల కోసం పోరాడే మమ్మల్ని మీకు ఇప్పుడు బీసీలు గుర్తుకు వచ్చారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ద్రోహం చేసిందని" కవిత మండిపడ్డారు.

# రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ బొంద పెట్టింది



**ప్రజానావ, హైదరాబాద్:** కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని బొంద పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతులు యాచించాలని రేవంత్ రెడ్డి అంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు..తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజు చేయాలని, వ్యవసాయాన్ని స్థిరికరించాలని, ఎవరూ ఆలోచించని విధంగా విప్లవాత్మకమైన పథకానికి రూపకల్పన చేశారు. రైతుల మీద ప్రేమ ఉండే నాయకుడు కాబట్టి.. కేసీఆర్ రైతుకు పెట్టుబడి ఇవ్వాలని ఆలోచన చేశారు. దాన్ని అమలు చేశారు. ఒకసారి కాదు.. వరుసగా 11 సీజన్లకు దరఖాస్తు, దండం పెట్టే అక్కర్లేకుండా.. నేరుగా వారి ఖాతాల్లో నిధులు జమ చేశారు. రూ. 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు కేసీఆర్. 12వ సీజన్ వేసేందుకు పైసలు జమ చేశాం. దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఉత్తరం రాసి ఆపారు అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది దాటిపోయినా రైతుబంధు రూపంలో రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదు. 12వ సీజన్ కింద రూ. 7500 కోట్లు మేమే వేసేటోళ్లం. మేం దాచిపెట్టిన రూ. 7500 కోట్లను వాళ్లు రైతుల ఖాతాల్లో వేశారు. కొత్తగా ఇవ్వకపోగా.. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట బిల్డప్ ఇచ్చారు. రైతులను రాజులను చేస్తాం అని రాహుల్ గాంధీ చేత ఉపన్యాసాలు ఇప్పించారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామన్నారు. ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ, బోనస్ రూ. 500, రైతు కూలీలకు రూ. 12 వేలు ఇస్తామన్నారు. ఇది రైతు డిక్లరేషన్ వాగ్దానాలు అని కేటీఆర్ గుర్తు చేశారు.



# చైనాలో కొత్త వైరస్ విజృంభన

## అప్రమత్తం అయిన భారత ప్రభుత్వం

**న్యూఢిల్లీ:** చైనాలో వైరస్ పేరు హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ) కలకలం సృష్టిస్తోంది. అది చైనాలో ఈ వైరస్ శరవేగంగా విస్తరిస్తోంది. దీంతో చైనా ఆసుపత్రులు..ఈ వైరస్ బాధితులతో కిటకిటలాడుతోన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఈ వైరస్ వ్యాప్తిపై దృష్టి కేంద్రీకరించాలంటూ నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఆదేశించింది. శ్వాస కోశ లక్షణాలు, ఇతర ఫ్లూ కేసులను నిశితంగా పరిశీలించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. మరోవైపు ఈ వైరస్ శరవేగంగా వ్యాపిస్తోన్న నేపథ్యంలో అంతర్జాతీయ ఏజెన్సీలతో భారత ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఫ్లూ, ఇతర శ్వాస కోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగా ఉంటాయని వైద్యులు వెల్లడిస్తున్నారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా ఉండడంతోపాటు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుందని వివరిస్తున్నారు. అయితే వైరస్ తీవ్రత అధికంగా ఉంటే.. బ్రాంకైటిస్, నిమోనియాకు దారి తీయవచ్చని చెబుతున్నారు. ఇక ఈ వైరస్ సోకితే.. వ్యాధి లక్షణాలు బయటపడడానికి మూడు నుంచి ఆరో రోజుల వ్యవధి పడుతుందని అంటున్నారు. కానీ ఈ వైరస్.. చిన్నారులు, వృద్ధులు, రోగ నిరోధక శక్తి లేని వారికి సోకే అవకాశమున్నట్లు పలు వైద్య సంస్థలు ఇప్పటికే స్పష్టం చేశాయి.వైరస్ వ్యాపించిన ప్రాంతాలను తాకిన తర్వాత నోరు, ముక్కు, కళ్లను తాకితే ఈ వైరస్ వ్యాప్తి చెందుతోంది.

# హాస్టల్ వ్యవహారంపై ముమ్మర దర్యాప్తు

### వేలిముద్రలు సేకరించిన పోలీసులు

### ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు





**ప్రజానావ, మేడ్చల్:** మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ కళాశాలలో వసతిగృహ స్నానాల గదిలో వీడియోలు చిత్రీకరించారంటూ విద్యార్థినులు చేసిన ఆరోపణలపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. కాగా హాస్టల్ బాత్‌రూమ్‌లో సీసీ కెమెరాల ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. విద్యార్తినుల తల్లిదండ్రులు ఇక్కడకు చేరుకోవడంతో ఆందోళన తీవ్రం అయ్యింది. తమ పిల్లల భవిష్యత్ ఏం కానుందో అన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హాస్టల్ వార్డెన్ సహా ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న వారి వేలిముద్రలను దర్యాప్తు బృందం సేకరించింది. మరోవైపు కళాశాలకు యాజమాన్యం మూడు రోజులపాటు సెలవులు ప్రకటించింది. వసతిగృహ స్నానాల గది వెంటిలేటర్ నుంచి తమను వీడియో తీశారంటూ మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ కళాశాల ఐటీ క్యాంపస్ విద్యార్థినులు బుధవారం ఆందోళనకు దిగగా ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలు, బీజేవైఎం నేతలు మద్దతు పలకడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. యాజమాన్యానికి నోటీసు జారీ చేసింది. కమిషన్ కార్యదర్శి పద్మజా రమణ వసతిగృహానికి వచ్చి విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. గర్ల్స్ హాస్టల్‌లో అమ్మాయిల ప్రైవేట్ వీడియోలు ఆగంతకులు తీశారని ఫిర్యాదు వచ్చాయి. ఇప్పటికే హాస్టల్ వార్డెన్‌తో సహా ఏడుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు పలు ఫింగర్ ప్రింట్‌లను కూడా పోలీసులు సేకరించారు. ఫింగర్ ప్రింట్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆడపిల్లల వీడియోలు బయటకి పోతాయేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫోరెన్సిక్ నుంచి వచ్చే రిపోర్ట్‌పైనే ఈ కేసు ఆధారపడి ఉంది. తాము స్నానం చేస్తుండగా వీడియోలు తీశారని.. బాత్ రూమ్‌లల్లో కెమెరాలు పెట్టారంటూ విద్యార్థినిలు ఆందోళన బాట పట్టారు. గత రెండు రోజులుగా విద్యార్థినిలు నిరసనకు దిగారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోవైపు విద్యార్థినిల ఆందోళనకు ఎన్ఎస్‌యూఐ నాయకులు మద్దతు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు కూడా సీఎంఆర్ కాలేజ్ ప్రాంగణానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మరోవైపు మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస రెడ్డి అక్కడకు చేరుకుని విద్యార్థినిలతో మాట్లాడారు. ఆందోళనను విరమించాలని కోరారు. అయితే తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనను విరమించేది లేదని విద్యార్థినులు స్పష్టం చేశారు. నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

# చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి

### ఉదయం ప్రత్యేక దళాలు కూంబింగ్

**రాయ్‌పూర్:** చత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. గరియాబాద్ జిల్లా ఇందగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సొర్నామల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోలు హతమయ్యారు. అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో స్థానిక పోలీసులు, ఎస్టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఒడిశాలోని నవరంగపూర్‌కు చెందిన సైనికులు కూడా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు నక్సలైట్లు హతమైనట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు తెలిపారు.

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

**ప్రజానావ, హైదరాబాద్:** ఫార్ములా ఈ–రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో ఈ నెల 6న ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని ఏసీబీ నోటీసుల్లో పేర్కొంది. అంటే వచ్చే సోమవారం కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇటీవల దాన కిశోర్ ను ఏడు గంటల పాటు విచారించిన ఏసీబీ పలు వివరాలను తీసుకుంది. దాన కిశోర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలోనే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.

### 7న ఈడీ కార్యాలయానికి..

7న విచారణకు రావాలని ఈడీ సైతం కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేపట్టింది. ఫెమా నిబంధనలను ఉల్లఘించినట్టుగా గుర్తించిన ఈడీ కేసును దర్యాప్తు చేపట్టింది.

# ఇది కోతల ప్రభుత్వం

- రైతు భరోసాపై మరోమారు మోసం చేసే యత్నం
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి





**ప్రజానావ, హైదరాబాద్ :** ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదు మాటల ప్రభుత్వం, కోతల ప్రభుత్వమని మండిపడ్డారు. రైతు భరోసాలో కోతలు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు ఎందరు ప్రభుత్వం దగ్గర డేటా ఉందని, దద్దమ్మ ప్రభుత్వం రైతుల నుండి దరఖాస్తులు ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. ఫసల్ భీమా ఊసే లేదు.. రైతు భరోసా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. రైతుల మీద అక్రమ కేసులు పెట్టి? రైతులకు సంకెళ్లు వేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, అప్పుడు బీఆర్ఎస్ రైతులకు సంకెళ్లు వేస్తే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వేస్తుంది సంకెళ్ళు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులకు అండగా ఉందని, నవంబర్ 30 న నాలుగో విడత రుణమాఫీ చేస్తున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు కిషన్ రెడ్డి. ఆ డబ్బులు ఇంకా రైతుల అకౌంట్ లలో చేరలేదని, ఇంకా నాలుగు సంవత్సరాలు అయిన రుణమాఫీ కాదని ఆయన సెటైర్లు వేశారు. కనీస మద్దతు ధర కొన్ని పంటల మీద 80 శాతం మోడీ ప్రభుత్వం పెంచిందని, కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా.. ధాన్యం కొనుగోలు లో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందింది? ఇది నేరపూరిత చర్య అని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రైవేట్ రైస్ మిల్లర్ లతో ఒప్పందం కుదుర్చుకుని రైతులకు అన్యాయం చేస్తుందని, రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. ఈ ప్రభుత్వానికి అధికారుల మీద అజమాయిషీ లేదా అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రజా భవన్‌లో 2008 డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నియామక పత్రాలు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ.. 2008 డీఎస్సీ అభ్యర్థుల కోసం జీవో నెంబర్ 9 తెచ్చి క్యాబినెట్ అప్రూవల్ చేసి కూడా సంవత్సరం గడిచింది.. అయినా తమకు ఉద్యోగాలు ఇవ్వలేదు అని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండోసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి కూడా 100 రోజులు కావొస్తుంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఒరిజినల్స్ తీసుకోని 4 నెలలు అవుతుంది.. ఒరిజినల్స్ సర్టిఫికెట్స్ లేనందున బయట ఉద్యోగాలు కూడా చేసుకోలేకపోతున్నామని, ఇంట్లో వాళ్లపై ఆధారపడలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
4
శనివారం
4 జనవరి 2025



# పథకాల అమలు పక్కాగా సాగాలి!

పథకాలు ఏవైనా ఓటు బ్యాంక్‌తో కాకుండా..ప్రజల సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించి కొనసాగించాలి. అవసరం మేరకే పథకాలను ప్రవేశ పెట్టడం జరగాలి. అలా జరిగినప్పుడే వాటికి సార్థకత ఉంటుంది. కొత్తగా రేషన్ కార్డుల మంజూరు, రైతుభరోసాకోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా మళ్లీ రేషన్ కార్డులు ఇస్తామని కూడా అంటున్నారు. ఇప్పటికే జనాభాను మించి పేద కుటుంబాలను గుర్తించి బియ్యం పంపిణీ చేస్తున్నారు. ధరలు పెరిగిన నేటి కాలంలో కిలో రూపాయి బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఏపిలో వేలకోట్ల రూపాయల బియ్యం పక్కదారి పట్టాయి. గోడౌన్ల నుంచే మాయం అయ్యాయి. నేతలే సూత్రధారులుగా మారి పక్కదారి పట్టించారు. ఇలాంటి సమయంలో తెలుగు రాష్ట్రాల్లో బియ్యం పథకాన్ని తక్షణం సమీక్షించాలి. వ్యాపారంగా మారిన చౌకబియ్యం ధరలను పెంచాలి. అలాగే పేదలను గుర్తించి వారికి మాత్రమే బియ్యం అందేలా చేయాలి. దీంతో ఖజానకు వేలకోట్లు ఆదా అవుతాయి. దీనిని సంస్కరించకుండా పోరాదు. ఉచిత విద్యుత్ కూడా సక్రమంగా పొలాలకు వెళ్లేది లేనిది లెక్క కట్టాలి. రైతుభరోసా కూడా కేవలం పంటలు వేసే వారికి అందాలి. ఈ పథకాలను పక్కాగా లెక్కలు తీసి అమలు చేయాలి. అప్పుడు వేలకోట్లు ఆదా కావడంతో ఖజనాకు భారం తప్పుతుంది. రైతుభరోసాకు సంబంధించి త్వరలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించదిం, రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించింది. సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితిని పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. అలాగే, రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఇదే సందర్భంలో రేషన్ బియ్యం, ఉచిత విద్యుత్ పొందుతున్న రైతుల నుంచి కూడా దరఖాస్తులు తీసుకోవాలి. ఇక్కడే ఎవరు పేదో..ఎవరు కాదో తెలుస్తుంది. గ్రామాల్లో ఎవరెవరు ఉచితంగా పథకాలు అప్పనంగా పొందుతున్నారో క్షేత్రస్థాయి అధికారులకు తెలుసు. పక్కాగా వీటిని అమలు చేయడంలో ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. రైతుభరోసా కోసం అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించాలనుకోవడం మంచిదే. గతంలో లాగా ఎవరికి పడితే వారికి రైతుభరోసా పేరుతో దుబారా చేయకపోవడం మంచిదే. ఇది పంటలు పండించే రైతులకు కూడా ధైర్యం ఇచ్చేది కానుంది.జనవరి 5 నుంచి 7 వరకు రైతు భరోసా దరఖాస్తులు స్వీకరించే అవకాశముందని, సంక్రాంతి పండుగ తర్వాత సర్కార్ రైతు భరోసాను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న వేళ... ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిందే. కేబినెట్ భేటీలో రైతు భరోసాకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోనున్నందున వివరాలు సేకరించడంలో తప్పలేదు. గత ప్రభుత్వం ఒక కోటీ 53 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చింది. గుట్టలు, వెంచర్లు, సాగుచేయని భూములకు కూడా గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని, ఇప్పుడు అలా కాకుండా కేవలం సాగు చేసే భూములకు రైతు భరోసా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ధరణి పోర్టల్ రికార్డుల ప్రకారం ఒకకోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇందులో సాగుచేసే భూమి కోటి 30 లక్షలు ఎకరాలుగా ప్రభుత్వం గుర్తించింది. కేవలం ఈ భూ ములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ విస్తీర్ణం 1,12,000 చదరపు కిలోమీటర్లు... అంటే దాదాపు 2 కోట్ల 75 లక్షల ఎకరాల భూమి. దీనిలో కోటీ 60 లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి, 66 లక్షల ఎకరాలు అటవీ భూమి, మిగిలినవి గ్రామకంఠాలు, పట్టణాలు, దేవాలయ మాన్యాలు, వక్ఫ్, ఇనాం, శిఖం కింద ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కూడా ఉజ్జాయింపు లెక్కలే కానీ, వాస్తవమైన రుజువులు చేయగలిగే స్పష్టమైన లెక్కలు లేవు. దీని కోసం ఎంత కష్టమైనా పొజిషన్ ప్రకారం సమగ్ర భూసర్వే చేసి తీరాలి. భూమికి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు కార్యాచరణ సాగాలి. అన్యాక్రాంతం, కబ్జా అయిన ప్రభుత్వ భూముల రక్షణ తో పాటు దేవాదాయ భూములను కూడా రక్షించాలి. ఇందుకోసం ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయాలి. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో అవతవకలు జరిగాయని గుర్తించినందున సరిదిద్దే పనిలో పారదర్శకంగా, పక్కాగా పనిచేయాలి. నిజానికి తెలంగాణ భూ సమాచారం విషయంలో దాపరికాలు ఏమీ ఉండవు. ఏ ఊరిలోకి వెళ్లినా, ఈ భూమి ఎవరిది అని అడిగినా... పూర్తి సమాచారాన్ని ప్రజలు నోటితో చెప్పేస్తారు. అటువంటి తెలంగాణలో భూ విషయంలో రహస్యం చేయడం వెనక ఉన్న మతలబు ఎవరికీ అర్థం కాలేదు. నేడు భూమాతలో ప్రతి విషయాన్ని నిర్భయంగా, నిర్దిష్టంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని అంశాలను పొందుపరుస్తూ, నిపుణుల నుండి మరికొన్ని సూచనలు, సలహాలు తీసుకొని తెలంగాణ రైతాంగ సమస్యలను తీర్చేందుకు, సులువైన మార్గాలను పొందుపరిచేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమాత పనిచేస్తే రైతులకు గొప్ప భరోసా కల్పించినట్లే అవుతుంది. ఈ క్రమంలోరైతు భరోసా సాయం మీద కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పాస్ పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరికి రైతుబంధు ఇచ్చింది. కొండలు, గుట్టలు, ఫామ్‌హౌస్‌లు, కంచెలకు కూడా డబ్బులిచ్చింది. ఈ ప్రభుత్వం కేవలం వ్యవసాయానికి మాత్రమే సాయం అందించాలనే దృఢమైన లక్ష్యంతో ఉన్నది. ప్రతి గ్రామంలోని విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్, శాటిలైట్ సహాయంతో పంట పొలాలను గుర్తించి నిజమైన రైతులకు సాయం అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నా తీరు అభినందనీయం. ఈ క్రమంలో విద్యుత్ వాడకం, చౌకబియ్యం సరఫరాలపైనా దృష్టి పెడితే మంచిది.

# కుంభమేళాలో వాతావరణ సమాచారం

## ప్రతి 15 నిముషాలకు మార్పులపై అలర్ట్



**ప్రయాగ్‌రాజ్:** కుంభమేళా నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే భక్తులు అక్కడి వాతావరణం గురించి తెలుసుకునేందుకు వాతావరణ శాఖ వెబ్‌సైట్‌లో ప్రత్యేక పేజీని పొందుపర్చామని ఐఎండీ డైరెక్టర్ మనీశ్ రణాల్కర్ తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రతీ 15 నిమిషాలకు ఒకసారి వాతావరణంలో వచ్చే మార్పులను తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా రోజుకు రెండుసార్లు వాతావరణ సూచనలను అందులో జారీ చేస్తామని వెల్లడించారు. దీని కోసం కుంభమేళా నిర్వహించే ప్రాంతాన్ని తాత్కాలిక జిల్లాగా ప్రకటించామన్నారు. మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా. ఈనేపథ్యంలో అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయి మంచు దట్టంగా కురుస్తోంది. కుంభమేళా నిర్వహించనున్న ఉత్తరప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. దీంతో అధికారులు భక్తుల కోసం మరిన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కుంభమేళాకు హాజరయ్యే భక్తుల అవసరాలు, భద్రత కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో పాల్గొనేవారి సంఖ్యను ఎప్పటికప్పుడు లెక్కించడంతోపాటు వారికి కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటుచేయడం కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నామని అధికారులు పేర్కొన్నారు. భక్తులకు తాత్కాలిక వసతి కల్పించేందుకు 1.6 లక్షల టెంట్లు, 1.5 లక్షల మరుగుదొడ్లు ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించారు. భద్రత కోసం పారామిలటరీ బలగాలు సహా 50 వేల మంది సిబ్బంది ఆ ప్రాంతంలో మోహరించారని తెలిపారు.

## కుంభమేళాకు ప్రత్యేక వెబ్‌పేజీ

**న్యూఢిల్లీ, జనవరి 3:** జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. కుంభమేళా నేపథ్యంలో ప్రత్యేక వెబ్‌పేజీని రూపొందించినట్లు తెలిపింది.




# రాబోయే ఐదేళ్లలో కాలుష్య రహిత ఢిల్లీ : గడ్కరీ



**న్యూఢిల్లీ,:** రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశ రాజధాని రవాణా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. గత నవంబర్ నుంచి ఢిల్లీలో కాలుష్య స్థాయి ఎక్కువగానే ఉన్నది. కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు. ఇటీవల గాలి నాణ్యత సూచీ 350 వరకు చేరింది. కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 కింద ఆంక్షలు మళ్లీ తీసుసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కార్లపై మరోసారి నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే, ఢిల్లీలోని వాతావరణ కాలుష్యానికి కారణాల్లో వాహనాలు ఉద్గారాలు సైతం ఒకటి. ఢిల్లీ రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడిని కేంద్రమంత్రి తెలిపారు. అదనంగా రూ.12500 కోట్ల సీఆర్ఐఎఫ్ ఫండ్‌ని సైతం ప్రకటించారు. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి రహదారుల మంత్రిత్వ శాఖ ఏయే ప్రాజెక్టులను ప్రారంభించబోతుందో ఆయన వివరించారు. వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో ఢిల్లీ ఇబ్బందులపడుతుందని.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీని ఆయా సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించిందన్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు కొత్త రోడ్డు ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయన్నారు. కాలుష్యాన్ని క్లీన్ ఎనర్జీ ద్వారా తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ కాలుష్యంలో 40శాతం శిలాజ ఇంధనాల వినియోగమే కారణమని.. దాంతో ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, స్కూటర్లు, సీఎన్‌జీ వాహనాలను తీసుకువచ్చామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కొత్త రోడ్ నెట్‌వర్క్‌తో వాహనాల రద్దీ తగ్గుతుందన్నారు. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ చుట్టూ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఇప్పటికే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించిందని.. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ప్రాజెక్ట్ కింద.. ఢిల్లీ-కత్రా ఎక్స్‌ప్రెస్ వేతో కుండ్లి మనేసర్ పాల్వాల్ ఎక్స్‌ప్రెస్ వే.. లేదంటే వెస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా కనెక్టివిటీని అందించే ఫేజ్-2ని మంత్రిత్వ శాఖ ఖరారు చేస్తోంది. ఆయా రోడ్‌నెట్ వర్క్‌ల ద్వారా జమ్మూ కశ్మీర్, పంజాబ్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా విమానాశ్రయం, ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేకు చేరుకునేలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కొత్త రోడ్ నెట్‌వర్క్ ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేకి నేరుగా కనెక్టివిటీని అందిస్తుందని.. దాంతో రాజధానిలో రద్దీని తగ్గించడంలో సహాపడుతుంది. మహిపాల్‌పూర్, రంగ్‌పురి ప్రాంతాల్లో రోజువారీ ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు ఐదు కిలోమీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మించే యోచనలో ఉన్నట్లు గడ్కరీ వివరించారు. రూ.3,500 కోట్లతో ఈ సొరంగాన్ని నిర్మించనున్నారు. ఈ సొరంగం వసంత్ కుంజ్‌లోని శివమూర్తి, నెల్సన్ మండేలా మార్గ్‌లను కలుపుతుంది.

# ఢిల్లీపై ప్రధాని వరాల జల్లు

## రూ.4,500 కోట్ల విలువైన వివిధ పథకాల ప్రారంభం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ రాష్ట్ర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ నేడు రూ.4,500 కోట్ల విలువైన వివిధ పథకాలను కానుకగా అందించనున్నారు. ప్రధాని మోదీ శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, శంకుస్థాపన చేసారు. 'అందరికీ హౌసింగ్' ప్రతిజ్ఞలో భాగంగా, ఢిల్లీలోని అశోక్ విహార్‌లోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్‌లో ఇన్-సిటు స్లమ్ రిహాబిలిటేషన్ ప్రాజెక్ట్ కింద మురికివాడల కోసం నిర్మించిన కొత్త ఎ÷-లాట్‌లను ప్రధాని మోదీ శుక్రవారం సందర్శించారు. ఢిల్లీలో ర్యాలీకి ముందు ప్రధాని మోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. ఢిల్లీ ప్రజలకు మెరుగైన అవకాశాలు, నాణ్యమైన జీవితాన్ని అందించాలనే మా అచంచలమైన నిబద్ధత ఈ రోజు ప్రారంభించబడుతున్న ప్రాజెక్టులలో ప్రతిబింబిస్తుందని రాసుకొచ్చారు. ఢిల్లీలోని అశోక్ విహార్‌లో మురికివాడల కోసం కొత్తగా నిర్మించిన 1,675 ఫ్లాట్‌లను ప్రధాని మోడీ ప్రారంభించి, అర్హులైన లబ్దిదారులకు స్వాభిమాన్ అపార్ట్‌మెంట్ల తాళాలను అందజేసారు. కొత్తగా నిర్మించిన ఎలాట్‌ల ప్రారంభోత్సవం ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా రెండవ విజయవంతమైన ఇన్-సిటు స్లమ్ పునరావాస ప్రాజెక్ట్‌ను పూర్తి చేసింది. ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం ఢిల్లీలోని మురికివాడల నివాసులకు తగిన సౌకర్యాలతో మెరుగైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడం. ఇక ఎలాట్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు వెచ్చించగా.. అర్హులైన లబ్దిదారులు మొత్తం సొమ్ములో 7 శాతం లోపే చెల్లించనున్నారు. అలాగే ఢిల్లీ యూనివర్శిటీలో రూ.600 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో మూడు కొత్త ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. ఇది తూర్పు ఢిల్లీలోని సూరజ్మల్ విహార్ లోని తూర్పు క్యాంపస్‌లో ఒక అకడమిక్ బ్లాక్, ద్వారకలోని పశ్చిమ క్యాంపస్‌లో ఒక అకడమిక్ బ్లాక్‌ని కలిగి ఉంటుంది. అలాగే నజఫ్‌గఢ్‌లోని రోషన్‌పురాలోని వీర్ సావర్కర్ కళాశాల భవనం కూడా ఉంది. వీటిలో విద్య కోసం అత్యాధునిక సౌకర్యాలు కల్పించనున్నారు.

# వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలలో ఏర్పాట్లు



**ప్రజానావ, తిరుమల:** తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని పలు ప్రాంతాలను అదనపు ఇఒ, జెఇఒ వీరబ్రహ్మం, జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో అదనపు ఇఒ మాట్లాడుతూ.. వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టిటిడి అధికారులు, విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలలో అధిక సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దర్శనానికి విచ్చేసే విఐపిలకు వారికి అందించే పాసులలోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వివరాలు పొందిపరిచనున్నట్లు తెలిపారు. విఐపిలు, యాత్రికులు తమకు కేటాయించిన సమయం ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యాత్రికులు తమ పాదరక్షలను గదులలో, వారి వాహనాలలో వదలి రావాలన్నారు. అధిక రద్దీ నేపథ్యంలో తోటి యాత్రికులకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్యాని పాటించాలని, వ్యర్ధాలను టిటిడి ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలని కోరారు.

# గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు సుప్రీం కోర్టు నోటీసులు




**న్యూఢిల్లీ:** డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు సు ప్రీం కోర్టు శుక్రవా రం నోటీసులు జారీ చేసింది. 2002లో జరిగిన డేరా మాజీ మేనేజర్ రంజిత్ సింగ్ మర్డర్ కేసులో గుర్మీత్‌తో పాటు మరో నలుగురికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ఆ కేసు నుంచి గుర్మీత్ పేరును తొలగించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సీబీఐ సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నదని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం తెలిపింది. బేలా త్రివేది బెంచ్ ముందుకు ఈ కేసును పంపనున్నట్లు చెప్పారు. హర్యానాలోని కురక్షేత్రలో ఉన్న ఖాన్పుర్ కాలనీలో 2002, జూలై 10వ తేదీన రంజిత్ సింగ్ హత్యకు గురయ్యాడు. అనేక మంది మహిళలపై గుర్మీత్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రాసి ఉన్న ఓ లేఖను రంజిత్ సింగ్ సర్క్యులేట్ చేసినట్లు అనుమానాలు ఉన్నాయి. ఆ మర్డర్ కేసులో పంచకుల సీబీఐ కోర్టు 2021లో రామ్ రహీమ్‌తో పాటు మరో నలుగుర్ని దోషులుగా ప్రకటించింది. అయిదుగురికి జీవితఖైదు శిక్ష వేసింది. గుర్మీత్‌కు 31 లక్షల జరిమానా కూడా విధించారు.




## జడ్జిల అభినందనలు

వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన బొడ్డు ప్రశాంత్‌కుమార్‌ను సీనియర్ సివిల్ జడ్జ్ లక్ష్మణాచారి, జూనియర్ సివిల్ జడ్జ్ జ్యోతిర్మయి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ గడ్డం లక్ష్మణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, కే. విద్యాసాగర్‌రావు, రేగుల దేవేందర్, లింగాల నారాయణరావు, పురుషోత్తం, కిషోర్‌రావు, పొత్తూరి అనిల్‌కుమార్, పెంట రాజు, నేధురి అభిలాష్, బొడ్డు దేవయ్య, కందుల క్రాంతికుమార్, సుజాత, అన్నపూర్ణ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

- ప్రజానావ, వేములవాడ

# ఉద్యోగులుగా గుర్తించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి




**ప్రజానావ, వేములవాడ:** సివిల్ సప్లయ్ హమాలి కార్మికులను ఉద్యోగులుగా గుర్తించడమే కాకుండా రిటైర్మెంట్ అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి బెన్‌ఫిట్స్ అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని, రెండేళ్లకు ఒకసారి అగ్రిమెంట్ చెయ్యాలని జీవో గతంలో ఇచ్చారని గుర్తుచేశారు. కానీ గతేడాది అగ్రిమెంట్ జరిగినా అమలు చేయలేదన్నారు. ఈ ఏడాది ఒకటో తేదీ నుంచి పెరిగిన కూలి రేట్ల ప్రకారం కూలీ కట్టివ్వాలని కోరినప్పటికీ ఇవ్వకపోవడంతో విధిలేక కార్మికులు సమ్మెలోకి దిగినట్లు చెప్పారు. దీపావళి సందర్భంగా స్వీట్, జత డ్రెస్ కుట్టు కూలీ, బోనస్ పెంపులు ఒప్పుకొని తరువాత ఇస్తామని, ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. క్వింటాల్‌కు రూ.29 ఇస్తామని ఇవ్వలేదని పేర్కొన్నారు. అలాగే కార్మికులను 4 వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తూ, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని ఈ సందర్భంగా కడారి రాములు డిమాండ్ చేశారు.



జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను మాజీ మేయర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవితకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

- ప్రజానావ, కరీంనగర్



### కేటీఆర్, హరీశ్‌ను కలిసిన బెజ్జంకి నాయకులు

**ప్రజానావ, బెజ్జంకి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బెజ్జంకి మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం వారి నివాసాల్లో వేర్వేరుగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. మాజీ మంత్రులను కలిసిన వారిలో బీఆర్ఎస్ బెజ్జంకి మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు లింగాల లక్ష్మణ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దీటి రాజు, నాయకులు బొమ్మకంటి రామలింగారెడ్డి, తాళ్లపల్లి నరేశ్ గౌడ్, కత్తి రాములు గౌడ్, ఎలుకంటి తిరుపతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.





## మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడంపై హర్షం

**ప్రజానావ, సిరిసిల్ల:** సావిత్రి బాయి పూలే దినోత్సవాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడంపై రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని గతంలో ఎన్నోసార్లు ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోలేదని గుర్తుచేసింది. సిరిసిల్లలో స్థానిక బాయ్స్ హై స్కూల్ లో సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే విద్యారంగానికి చేసిన కృషి చేసిందన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సమాజంలో మహిళా విద్య కోసం అనేక ఛీత్కారాలను ఎదుర్కొని, మొక్కవోని ధైర్యంతో మహిళాభ్యున్నతికి పాటుపడినట్లు చెప్పారు. సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఇది నిజంగా మహిళాభ్యున్నతి కోసం కృషిచేసిన వారికి గుర్తింపునివ్వడమే అని అంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు, పూర్వ అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండమనేని మహేందర్ రావు, ఆడేపు శివ కుమార్, టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీ. సురేశ్, గొల్లపల్లి శ్రీనివాస్ రాచర్ల రమేశ్, కోటగిరి లక్ష్మణ్, శివరాత్రి సంతోష్, వద్యారపు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి: సీపీఎం



**ప్రజానావ, బోయిన్‌పల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండల కేంద్రంలో పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 50 పడకల ఆసుపత్రిని ఏర్పడి చేయాలని సీపీఎం మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామాల ప్రజలకు సరైన వైద్యం అందక దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి చిన్న సమస్యకు వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ వెళ్లాల్సిన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్క గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బోయిన్‌పల్లి మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు ఎంతో సౌకర్యంగా, అందుబాటులో ఉంటుందన్నారు. మండల కేంద్రం అభివృద్ధి అయ్యే అవకాశం ఉండడంతో రెవెన్యూ అధికారులు విషయాన్ని కలెక్టర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్, నాయకులు సింగిరెడ్డి శంకర్, అనుముల రవి, ఆవుల రాములు, కడుదుల రవి, సింగిరెడ్డి మల్లయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే

**ప్రజానావ, కరీంనగర్:** మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్య మూర్తి, సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన సామాజిక ఉద్యమ కారిణి సావిత్రి బాయిపూలే అని బిఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేటర్లు ఎదుల్లా రాజశేఖర్, నాంపల్లి శ్రీనివాస్, గుగ్గిళ్ల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కరీంనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, పార్టీ 55వ డివిజన్ అధ్యక్షుడు చేతి చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.



బిఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

## గోవిందరాజుల స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



**ప్రజానావ, చందుర్తి:** చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజుల స్వామి వారిని శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ కు ఘనస్వాగతం పలికి, సన్మానించారు. గోవింద రాజుల స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు విప్ ఆది పేర్కొన్నారు.

## సావిత్రిబాయి పూలే జయంతి



**ప్రజానావ, తిమ్మాపూర్:** సమాజంలో అన్ని వర్గాల మహిళలు బాలికలు విద్యను అభ్యసించేందుకు సావిత్రిబాయి పూలే కృషి చేశారని ప్రతిభా పాఠశాల సీఈఓ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల మహిళలు విద్యను అభ్యసించాలని అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. దేశ మహిళా ఉపాధ్యాయురాలు, సామాజికవేత్త సావిత్రిబాయి పూలే నేటి మహిళాలోకానికి ఆదర్శనీయురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, వార్డెన్ మౌనిక ఉపాధ్యాయురాలు కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయినులకు సన్మానం



**ప్రజానావ, బెజ్జంకి:** దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను బెజ్జంకి మండలంలో కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. నిమ్న వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే కాకుండా, సమాజ మార్పు కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తిగా నిలిచారని,1848లో తన భర్తతో కలిసి పూణేలో మొదటి బాలికల పాఠశాలని ప్రారంభించారని గుర్తుచేశారు. విద్యతో పాటు కుల, లింగ వివక్షలను తొలగించడానికి ఆమె ఎనలేని కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మహిళ ఉపాధ్యాయినులకు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శానాగొండ శరత్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేశ్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, దేవస్థానం చైర్మన్ జెల్ల ప్రభాకర్, బోనగం రమేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, బహుజన్ సమాజ్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి నిషాని రాజమల్లు, నియోజకవర్గం అధ్యక్షులు మాతంగి తిరుపతి, బెజ్జంకి మండల అధ్యక్షుడు సావనపల్లి రాజు, దళిత సంఘాల నాయకులు ఎలుక దేవయ్య, చింతకింది పర్శారములు, వద్లూరి పర్శరాములు, బిగుల్ల మోహన్, మహంకాళి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం వేడుకలు




**ప్రజానావ, గన్నేరువరం:** దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా విశేష కృషి చేసిన సావిత్రి భాయి పూలె అందరికీ ఆదర్శమని గన్నేరువరం మండల విద్యాధికారి రామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రము లోని జడ్పీఎచ్ఎస్ స్కూల్ లో సావిత్రి భాయి పూలె జయంతి నీ పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, విద్యార్ధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
6 శనివారం
4 జనవరి 2025

# అభ్యుదయవాది, సంఘ సేవకురాలు సావిత్రిబాయి

### సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజానావ, కరీంనగర్:** దేశంలో అణగారిన పేద, బడుగు,బలహీన వర్గాల వారికి అక్షరాలు నేర్పిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు.. అభ్యుదయవాది, సంఘ సేవకురాలు సావిత్రిబాయి ఫూలే అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి జయంతి ని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యుదయవాది సావిత్రిబాయి ఫూలే




**ప్రజానావ, పెద్దపల్లి:** తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళల అభ్యున్నతి కోసం పనిచేసిన అభ్యుదాయవాది సావిత్రి బాయి ఫూలే అని పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణవేన సురేశ్ గౌడ్ కొనియాడారు. సావిత్రిబాయి ఫూలే జయంతి పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని అధికారంగా ప్రకటించడం హర్షణీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మహిళా ఉపాధ్యాయులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూతగడ్డ సంపత్, తూముల సుభాష్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేడగోని శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగుల సంతోష్, ఎరుకల రమేష్, తాడూరు శ్రీమాన్, కట్ట నరేంద్ర చారి, కోదాది భాస్కర్, తిరుమల రావు, కనకయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెరువుశిఖం భూమిని పరిరక్షించండి

**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పందిల్లలో సర్వే నెంబర్ 185 లో గల 43.03 ఎకరాల చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని, అదే గ్రామానికి చెందిన కౌంజు కుమార స్వామి తెలిపాడు. శిఖం భూమిలో దాదాపు 30 ఎకరాల వరకు కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడ్డారని వాపోయాడు. చెరువు కింద దాదాపు 100 ఎకరాల సాగు అయ్యేదని, శిఖం భూమి ఆక్రమణలతో ప్రస్తుతం 20 ఎకరాలు కూడా సాగు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు శిఖం భూమి ఆక్రమణతో చెరువులో నీరు లేక భూములు సాగు కావడంలేదని వాపోయాడు. చెరువు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, కబ్జాలపై అనేక సార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశాడు. భూ ఆక్రమణలపై విచారణ జరిపి, ప్రభుత్వ భూమిని కాపాడాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఫారెస్ట్ ట్రెంచ్‌లో పడి యువకుడి మృతి

**ప్రజానావ, తాండూర్:** తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కన్నాల గ్రామ శివారులో పంచర్పుల శ్రీకాంత్ (30) అనే యువకుడు బుగ్గ దేవాలయం సమీపాన గల ఫారెస్ట్ ట్రెంచ్ లో పడి మృతి చెందినట్లు ఎస్సై డీ. కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ కు చెందిన శ్రీకాంత్ తన స్నేహితులతో కలిసి మంచిర్యాలలో ఉంటూ మిషన్ భగీరథలో పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం కల్లు తాగడానికి తన మిత్రుడితో కలిసి కన్నాలకు వచ్చి అక్కడి నుంచి బుగ్గ టెంపుల్ దగ్గరలోకి వచ్చి ఫారెస్ట్ ట్రెంచ్ లో పడి మృతి చెందినట్లు చెప్పారు. మృతి పై అనుమానం ఉందని శ్రీకాంత్ తండ్రి పంచర్పుల పోశం ఫిర్యాదు చేయగా, తాండూర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# కలెక్టరేట్‌ను సందర్శించిన అద్విత స్టూడెంట్ కౌన్సిల్

**ప్రజానావ, కరీంనగర్:** అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పర్యావరణానికి హానికరంకాని, సృజనాత్మకమైన శుభాకాంక్ష కార్డులను అందించారు. ఇవి పర్యావరణాన్ని సంరక్షించే స్కూల్ నిబద్ధతను ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఐక్యరాజ్యసమితి 17 సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీఎస్) పట్ల నిబద్ధతతో ఉన్న బాధ్యతాయుత యువకులుగా మారేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా వారు సమర్థవంతమైన, సమాన హక్కులతో కూడిన భవిష్యత్తును సృష్టించాలనే తమ సంకల్పాన్ని తెలియజేశారు. విద్యార్థులు జిల్లా స్థాయిలో ఒక ఎస్‌డీజీ క్లబ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ప్రస్తావించారు. ఈ క్లబ్ ద్వారా జిల్లాలోని పాఠశాలలు తమ అభిప్రాయాలను పంచుకోవడమే కాకుండా, ఎస్‌డీజీఎస్ ను ప్రోత్సహించే కార్యక్రమాలను అమలు చేయడం కోసం వేదికగా ఉపయోగపడనుంది. అనంతర కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనాత్మక వినూత్న ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు. మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సొగని సామాజిక విభాగం, స్టూడెంట్ కౌన్సిల్ ప్రపంచవ్యాప్తంగా జ్ఞానాన్ని పంచుకోవడం, పర్యావరణంపై అవగాహన పెంపొందించడంలో చూపించిన కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్వేత మాట్లాడుతూ ఈ కార్యక్రమం స్కూల్ నైతిక, సాంఘిక బాధ్యతలు కలిగిన నాయకులను తయారు చేయాలనే దృష్టికి అద్దం పట్టే కార్యక్రమమని చెప్పారు.

# సాక్షరతతోనే మహిళా సాధికారత

**సావిత్రీబాయి ఫూలే పోరాటం స్ఫూర్తిదాయకం • మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**ప్రజానావ, తిమ్మాపూర్:** సాక్షరతతోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మహిళా చైతన్యమూర్తి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రీబాయి ఫూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆ మహనీయురాలుకు ఘనంగా నివాళులర్పిస్తూ ఈ మేరకు పత్రికా ప్రకటన జారీ చేశారు. చదువు వల్లనే మహిళల సాధికరత సాధ్యపడుతుందని సావిత్రీబాయి ఫూలే బలంగా విశ్వసించారని, అందుకే ఆమె మహిళలకు విద్యనందించేందుకు నిరంతరం పాటుపడ్డార ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రపుటల్లో నిలిచిపోయిన సావిత్రీబాయి ఫూలే తనకున్న శక్తిసామర్థ్యాలతో సమాజంలో చారిత్రాత్మకమైన మార్పులకు పునాది వేశారని ఆయన కొనియాడారు. మహిళల విద్యకు ప్రాధాన్యం కల్పించడమే కాకుండా అణచివేతలకు



గురైనవారికి న్యాయం అందించేందుకు తమ జీవితాన్ని అర్పించారని, లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. సావిత్రిబాయి ఫూలే ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒక వైపు సావిత్రీబాయి, ఆరో వైపు ఆమె భర్త జ్యోతీరావు ఫూలే దేశానికి ఎనలేని సేవలందించారని, వారి త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే కొనియాడారు. సావిత్రీబాయి ఆశయాలను సాధించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మహిళల సాధికారతకు పెద్దపీట వేయటంతో పాటు, మహిళలను అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించే నైపుణ్యాల వృద్ధికి వినూత్న కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సావిత్రిబాయి ఫూలే చేసిన కృషి, త్యాగాలకు గుర్తింపుగా ఏటా సావిత్రిబాయి ఫూలే జయంతిని 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం'గా జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

# సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

**హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి • ఉల్లంపల్లిలో ఘనంగా సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలు**

**ప్రజానావ, చిగురుమామిడి:** సావిత్రిబాయి ఫూలే స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంధకార భారతావనిలో మెరిసిన వేగుచుక్క సావిత్రీబాయి ఫూలే అని కొనియాడారు. ఆమె బాలికా విద్యను ప్రోత్సహించి సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపడానికి విశేష కృషి చేసిందని పేర్కొన్నారు. మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిని సావిత్రిబాయి ఫూలే అని కొనియాడారు. ఎక్కడాలేని విధంగా మహాత్మ జ్యోతిరావు ఫూలే సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఉల్లంపల్లిలో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుదగోని శ్రీనివాస్ గౌడ్, వీరన్న యాదవ్, పోలు స్వప్న, ఉల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి, కానవేని శివకుమార్, గంపల శ్రీనివాస్, పచ్చిమట్ల శ్రీకాంత్, సుదగోని దినేష్, నాంపల్లి తిరుపతి, సుదగోని రాజు, స్కూల్ హెడ్ మాస్టర్ సాదిక్ మసారత్ అలీ, ఉపాధ్యాయులు లావుద్య కాళిదాసు, రచల్ ఇలియాస్ కరుణాకర్, లింగాల రాజు, కొత్తపల్లి సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్లు నర్సింగోజు పద్మ, కోల శారద, బుర్ర శ్రీలత, కొత్తపల్లి సంధ్య, కొత్తపల్లి సుజాత, కానవేని మల్లయ్య, కొత్త తిరుపతి, కొత్తపల్లి వినోద్, నర్సింగోజు విజయ్, కానవేని ఒదయ్య, జేరిపోతుల రాజు, విద్యార్థినులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# సిడ్నీలోనూ తేలిపోయారు

- మరోసారి నిరాశపరిచిన భారత బ్యాటింగ్
- తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైన టీమిండియా
- తొలి వికెట్ కోల్పోయిన ఆసీస్

**సిడ్నీ:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 5వ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైన భారత జట్టు.. అనంతరం ఆటముగిసే సమయానికి ఆస్ట్రేలియా జట్టుకు బిగ్ షాక్ ఇచ్చింది. 2 పరుగుల వద్ద ఉస్మాన్ ఖవాజాను పెవలియన్ చేర్చన బుమ్రా ఊహించని షాక్ ఇచ్చాడు. ఇక తొలి రోజు ఆట ముగిసే సమయానికి సామ్ కొన్‌స్టాస్ 7 పరుగులతో నాటౌట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు టాస్ గెలిచిన భారత జట్టు కేవలం 185 పరుగులకే ఆలౌట్ అయింది. టీమ్ ఇండియా తరపున రిషబ్ పంత్ అత్యధికంగా 40 పరుగులు చేశాడు. 26 పరుగుల వద్ద రవీంద్ర జడేజా ఔటయ్యాడు. శుభ్‌మన్ గిల్ 20 పరుగులు చేయగా, విరాట్ కోహ్లీ 17 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్ బోలాండ్ 4 వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్ 3 వికెట్లు తీశాడు. పాట్ కమిన్స్ 2 వికెట్లు తీశాడు. నాథన్ లియాన్ ఖాతాలో ఒక వికెట్ చేరింది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో రోహిత్ శర్మ స్థానంలో జస్ప్రీత్ బుమ్రా టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రోహిత్ శర్మకు విశ్రాంతి ఇచ్చారు. అయితే గాయం కారణంగా ఆకాశ్ దీప్ ఈ మ్యాచ్ ఆడడం లేదు. శుభ్‌మన్ గిల్ తిరిగి రాగా, ప్రసిద్ధ్ కృష్ణకు అవకాశం లభించింది. రిషభ్ పంత్(98 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 40), రవీంద్ర జడేజా(95 బంతుల్లో 3 ఫోర్లతో 26) టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో బుమ్రా(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) విలువైన పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్బోలాండ్(4/31) నాలుగు వికెట్లతో చెలరేగగా.. మిచెల్ స్టార్క్(3/49) మూడు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్(2/37) రెండు వికెట్లు దక్కాయి. నాథన్ లయన్ ఓ వికెట్ తీసాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్(4) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ కాసేపటికే యశస్వి జైస్వాల్(10)ను బోలాండ్ స్టన్నింగ్ డెలివరీతో పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి విరాట్ కోహ్లీ రాగా.. ఎదుర్కొన్న ఫస్ట్ బాల్‌కే అతనికి లైఫ్ లభించింది. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్‌ను కోహ్లీ వెంటాడగా.. స్లిప్‌లో ఉన్న స్మిత్ వైపు దూసుకెళ్లింది. అయితే అతను బంతిని అందుకునే క్రమంలో నేలకు తాకడంతో అంపైర్ నాటౌటిచ్చాడు. ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఔటయ్యే ప్రమాదం నుంచి కోహ్లీ బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి ఆచితూచి ఆడాడు. ఓపికగా ఆడిన ఈ జోడీని నాథన్ లయన్ విడదీసాడు. తొలి సెషన్ ఆఖరి బంతికి శుభ్‌మన్ గిల్ అనవసర షాట్‌తో పెవిలియన్ చేరాడు. దాంతో భారత్ 57/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. క్రీజులోకి రిషభ్ పంత్ రాగా.. రెండో సెషన్ ప్రారంభమైన కాసేపటికే కోహ్లీ(17) మరోసారి తన బలహీనతను బయటపెట్టుకున్నాడు. మళ్లీ ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీని వెంటాడి పెవిలియన్ చేరాడు. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన జడేజాతో కలిసి పంత్ పోరాడాడు. శరీరాన్ని అడ్డుపెట్టి క్రీజులో నిలబడ్డాడు. పిచ్‌పై అనూహ్య బౌన్స్ ఉండటంతో బంతి అనేకసార్లు రిషభ్ పంత్ శరీరానికి తాకింది. 107/4 స్కోర్‌తో టీమిండియా టీ బ్రేక్‌కు వెళ్లింది. చివరి సెషన్‌లోనూ పంత్-జడేజా ఓపికగా బ్యాటింగ్ చేశారు. పదే పదే బంతులు రిషభ్ పంత్‌కు తాకాయి. దెబ్బల వల్లనో ఏమో తెలియదు కానీ 97 బంతులు ఓపికగా ఆడిన పంత్.. అనవసర షాట్‌తో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ మరుసటి బంతికే నితీష్ కుమార్ రెడ్డి గోల్డెన్ డకౌటయ్యాడు. దాంతో భారత్ కోలుకోలేకపోయింది. కాసేపటికే జడేజా(26) కూడా ఔటవ్వగా.. సుందర్ పోరాడే ప్రయత్నం చేశాడు. కానీ అతన్నికమిన్స్ పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 148 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఆలౌట్ దిశగా సాగింది. ఈ పరిస్థితుల్లో జస్ప్రీత్ బుమ్రా.. ప్రసిధ్ కృష్ణ, సిరాజ్‌లతో కలిసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జట్టుకు 185 పరుగుల గౌరవ ప్రదమైన స్కోర్ అందించాడు.



## రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ ముగిసినట్లే !

### 5వ టెస్ట్ ప్లేయింగ్ 11లో కనిపించని రోహిత్ పేరు

**సిడ్నీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తన చివరి టెస్ట్ ఆడకుండానే రిటైర్మెంట్ చేయనున్నాడా? అందుకు ఔననే సమాధానం వస్తోంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో చివరి టెస్ట్ అంటే 5వ టెస్ట్ ప్లేయింగ్ 11లో రోహిత్ శర్మ పేరు కనిపించలేదు. ఇప్పటికే పేలవ ఫాం ఓ పక్క, కెప్టెన్సీ వైఫలం మరో పక్కా. ఇలా ఎన్నో విమర్శల మధ్య మరో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 3 జనవరి 2025 రోజు భారత క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఏదైనా గాయం లేదా మరేదైనా కారణాల వల్ల జట్టు కెప్టెన్ ప్లేయింగ్-11కి దూరంగా ఉండాల్సి రావడం గమనార్హం. సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చివరి టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను చేర్చలేదు. ఆ తర్వాత ఇప్పుడు రోహిత్ టెస్ట్ కెరీర్‌పై ప్రశ్నార్థకమైంది. సిడ్నీలోని ఎస్‌సీజీలో జరుగుతున్న చివరి టెస్టు నుంచి రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత, రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ ముగిసినట్లేనని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు అతను ఎర్రటి బంతితో టీమ్ ఇండియా కోసం ఆడటం ఎప్పటికీ కనిపించదా అనే ప్రశ్న తలెత్తుతుంది. అవును.. ఇప్పుడు రోహిత్ శర్మ టెస్టు కెరీర్ ప్రమాదంలో పడింది. భారత క్రికెట్ జట్టు అత్యుత్తమ కెప్టెన్‌లలో ఒకరైన రోహిత్ శర్మను సిరీస్ మధ్యలో జట్టు ప్లేయింగ్-11 నుంచి తొలగించారు. అతని ప్రస్తుత ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే, మెల్‌బోర్న్‌లో జరిగిన నాల్గవ టెస్ట్ మ్యాచ్ తనకు చివరిదని చెబుతున్నారు. అతని టెస్ట్ కెరీర్‌కు వీడ్కోలు మ్యాచ్ ఆడకుండానే వీడ్కోలు పలికాడని చెబుతున్నారు. ఇప్పుడు అతనికి వైట్ జెర్సీ ఫార్మాట్‌లో అవకాశం లభించే అవకాశం లేదు. ఎందుకంటే, గత కొంత కాలంగా టెస్టుల్లో హిట్ మ్యాన్ ఆడుతున్న తీరు అతడి టెస్టు కెరీర్ కు ఫుల్ స్టాప్ పడబోతోందని సూచిస్తోంది. సిరీస్‌లో ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడు చాలా పేలవంగా ఆడాడు. 3 టెస్ట్ మ్యాచ్‌లలో 5 ఇన్నింగ్స్‌లలో అతని బ్యాట్ నుంచి 31 పరుగులు మాత్రమే వచ్చాయి. ఇది మాత్రమే కాదు, అంతకుముందు న్యూజిలాండ్ వర్సెస్ బంగ్లాదేశ్ సిరీస్‌లు కూడా చాలా ఘోరంగా ఉన్నాయి. సిడ్నీలో జరగనున్న చివరి టెస్టు మ్యాచ్ తర్వాత రోహిత్ శర్మ తన టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకోవచ్చని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఇప్పుడు సిడ్నీ టెస్టులో కూడా ఆడలేని పరిస్థితి ఏర్పడింది. టెస్టు ఫార్మాట్‌లో రోహిత్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ నమ్మకం కోల్పోయిందని, ఇక్కడి నుంచి రోహిత్ కూడా త్వరలో రిటైర్మెంట్ తీసుకోవచ్చని తెలుస్తోంది.

## బుమ్రాతో కోన్ స్టాస్ వాగ్వివాదం ..!



**సిడ్నీ:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ జరుగుతున్న చివరి టెస్ట్ లో భారత్ 185 పరుగులకే ఆలౌట్ అయింది. భారత ఆటగాళ్లో రిషబ్ పంత్ 40 పరుగులు చేయగా.. రవీంద్ర జడేజా 26, గిల్ 20 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో బోలాండ్ 4 వికెట్లు తీయగా.. స్టార్క్ 3, కమ్మిన్స్ 2, లయన్ ఒక వికెట్ పడగొట్టాడు. మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను ఆదిలోనే దెబ్బ కొట్టాడు. ఈ క్రమంలోనే ఆసీస్ ఓపెనర్ సామ్ కోన్ స్టాస్ భారత కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రాతో వాగ్వాదానికి దిగాడు. కోన్ స్టాస్ భారత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా వాగుతూనే ఉన్నాడు. ఇరిటేషన్ తెప్పించే ప్రయత్నం చేశాడు. ఆసీస్ బ్యాటింగ్ మొదలు పెట్టినప్పుడు అతను దూకుడుగా ఆడాడు. జస్ప్రీత్ బుమ్రా వేసిన మొదటి బంతినే కోన్ స్టాస్ బౌండరీ తరలించాడు. ఈ క్రమంలోనే బుమ్రా మూడో ఓవర్ బౌలింగ్ వేశాడు. నాలుగు బాల్స్ పూర్తి అయ్యాయి. ఐదో బంతి వేసేందుకు సిద్ధం కాగా.. స్ట్రైకింగ్ చేస్తున్న ఖవాజా పక్కకు జరిగాడు. దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. వెనక్కు వెళ్లి బౌలింగ్ చేసే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాన్ ఏదో అన్నాడు. దీంతో బుమ్రా వెనక్కు దిరిగి అతని వద్దకు వెళ్లే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాస్ కూడా మాట్లాడడంతో మాటమాట పెరిగింది. ఈ క్రమంలోనే ఎంపైర్ జోక్యం చేసుకున్నాడు. దీంతో గొడవ సర్దుకుంది. ఆ తర్వాత ఓవర్ చివరి బంతికి బుమ్రా ఖవాజాను ఔట్ చేశాడు. అతను స్లిప్ లో క్యాచ్ ఇచ్చాడు. కేఎల్ రాహుల్ క్యాచ్ పట్టాడు. దీంతో భారత ఆటగాళ్లు, స్పెషల్లీ బుమ్రా కోన్ స్టాస్ వైపు చూస్తూ సంబరాలు చేసుకున్నారు. కాగా సమయాన్ని వృథా చేయాలనే వ్యూహంలో భాగంగానే జస్ప్రీత్ బుమ్రాతో ఆస్ట్రేలియా ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ గొడవకు దిగాడని టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ అన్నాడు. ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఆఖరి టెస్ట్ తొలి రోజు ఆట చివర్లో బుమ్రా-కొన్‌స్టాస్ గొడవపడ్డారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఐదో బంతి వేసేందుకు బుమ్రా సిద్దమవ్వగా.. స్ట్రైకింగ్‌లో ఉన్న ఉస్మాన్ ఖవాజా పక్కకు జరిగాడు. దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. కాస్త ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందుకు నాన్ స్ట్రైకర్‌గా ఉన్న కొన్‌స్టాస్ బదులివ్వడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరూ ఒకరిపై ఒకరు దూసుకెళ్లేందుకు సిద్ధమవ్వగా అంపైర్లు జోక్యం చేసుకొని వారించారు. ఈ ఓవర్ చివరి బంతికే ఉస్మాన్ ఖవాజా ఔటవ్వగా.. భారత ఆటగాళ్లు కొన్‌స్టాస్ లక్ష్యంగా సంబరాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న రిషభ్ పంత్‌కు బుమ్రా-కొన్‌స్టాస్ గొడవకు సంబంధించిన ప్రశ్నలు ఎదురయ్యాయి. సమయాన్ని వృథా చేయాలనే ఉద్దేశంతోనే ఆసీస్ ఓపెనర్లు అలా వ్యవహరించారని పంత్ బదులిచ్చాడు. 'నాకు తెలిసి సమయాన్ని వృథా చేయాలని ఆసీస్ ఓపెనర్లు భావించారు. జస్ప్రీత్ బుమ్రాతో సామ్ కొన్‌స్టాస్ గొడవపడటానికి కారణం కూడా ఇదేనని నేను భావిస్తున్నా. అతను ఏదో అన్నాడు. ఏం అన్నాడో నాకు వినిపించలేదు. కానీ ఆ సమయంలో నాకు అనిపించింది ఏందంటే.. మేం మరో ఓవర్ వేయకుండా సమయాన్ని వృథా చేయాలని భావించారని అర్థమైంది.'అని రిషభ్ పంత్ పేర్కొన్నాడు.



## రోహిత్ తప్పుకోవడం భావోద్వేగ నిర్ణయం

### రోహిత్ నిఖార్సైన సారథి : రిషభ్ పంత్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదో టెస్ట్ నుంచి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తప్పుకోవడం భావోద్వేగపూరితమైన నిర్ణయమని వికెట్ కీపర్ రిషభ్ పంత్ తెలిపాడు. ఇదో నిస్వార్థమైన పని అని, రోహిత్ నిఖార్సైన సారథని ప్రశంసించాడు. శుక్రవారం సిడ్నీ వేదికగా ప్రారంభమైన ఐదో టెస్ట్‌కు రోహిత్ శర్మ దూరంగా ఉండగా.. జస్ప్రీత్ బుమ్రా జట్టును నడిపిస్తున్నాడు. జట్టు ప్రయోజనాల కోసమే రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడని టాస్ సందర్భంగా బుమ్రా తెలిపాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(98 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 40), రవీంద్ర జడేజా(95 బంతుల్లో 3 ఫోర్లతో 26) టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో బుమ్రా(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) విలువైన పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్బోలాండ్(4/31) నాలుగు వికెట్లతో చెలరేగగా.. మిచెల్ స్టార్క్(3/49) మూడు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్(2/37) రెండు వికెట్లు దక్కాయి. తొలి రోజు ఆట అనంతరం మీడియాతో మాట్లాడిన రిషభ్ పంత్‌ను రోహిత్ గైర్హాజరీ గురించి ప్రశ్నించగా తనదైన శైలిలో బదులిచ్చాడు. 'నాకు తెలిసి ఇది భావోద్వేగ పూరితమైన నిర్ణయం. ఎందుకంటే సుదీర్ఘ కాలంగా రోహిత్ సారథిగా కొనసాగుతున్నాడు. మేమంతా అతన్ని టీమ్ నాయకుడిగానే చూస్తున్నాం. కానీ కొన్ని నిర్ణయాల్లోనే మనం భాగం కాలేం. ఇది మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయం. ఆ చర్చలో నేను భాగం అవ్వలేదు. కాబట్టి ఇంతకు మించి నేను ఏం చెప్పలేను.'అని రిషభ్ పంత్ పేర్కొన్నాడు.




## రోహిత్ తన చివరి టెస్టు మ్యాచ్ ఆడేశాడు..!

### భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్

**సిడ్నీ:** చివరి టెస్ట్ లో రోహిత్ శర్మ ఆడకపోవడంపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ తన చివరి టెస్టు మ్యాచ్ ఆడినట్లు గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. 5వ టెస్ట్ మ్యాచ్ లంచ్ విరామ సమయంలో మాట్లాడిన గవాస్కర్, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25 చివరి టెస్ట్ మ్యాచ్ నుంచి తనకు తానుగా విశ్రాంతి తీసుకోవాలనే రోహిత్ శర్మ నిర్ణయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలన్నాడు. భారత్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించలేదని తను అనుకుంటున్నట్లుగా చెప్పాడు. బహుశా తాము టెస్టు క్రికెట్‌లో చివరిసారిగా రోహిత్ శర్మను చూశామని సునీల్ గవాస్కర్ స్టార్ స్పోర్ట్స్‌తో పేర్కొన్నాడు. సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో రోహిత్ శర్మకు విశ్రాంతి ఇవ్వడం వెనుక సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ పాత్ర ఉందని గవాస్కర్ వాదించారు. సిడ్నీ టెస్టుకు ముందు భారత్ 1-2తో వెనుకబడి ఉంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో నిలవాలంటే సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించాలన్నారు. భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కూడా గవాస్కర్ లాగానే అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటిస్తే ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నాడు. రోహిత్ శర్మ ఈ సిరీస్ లో మూడు మ్యాచ్ లు ఆడాడు. సిరీస్ లో కేవలం 31??పరుగులే చేశాడు. ఒకసారి మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. రోహిత్ 15 ఇన్నింగ్స్‌లలో కేవలం 10.93 సగటుతో 164 పరుగులు చేశాడు. ఈ నేపథ్యంలో అతడిపై వేటు వేయాలని డిమాండ్ పెరిగిం ది. అయితే అతను కెప్టెన్ కాబట్టి అంత త్వరగా వేటు వెయ్యరని అనుకున్నారు. అయితే సిడ్నీ మ్యాచ్ ఒక రోజు ముందు టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మీడియా సమావేశానికి హాజరయ్యారు. సిడ్నీ టెస్ట్ లో రోహిత్ ఆడతాడా అన్న ప్రశ్నకు పిచ్ పరిశీలించన తర్వాత తుది జట్టును ప్రకటిస్తామని గంభీర్ చెప్పాడు. దీంతో చివరి మ్యాచ్ లో రోహిత్ శర్మ ఆడకపోవచ్చని అందురు అన్నుకున్నారు. అనుకున్నట్లుగానే జరిగింది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..




సినిమా
CINEMA

# డిఫరెంట్ అవతారాల్లో రాంచరణ్

## డైరెక్టర్ శంకర్



గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్. శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్న ఈ మూవీ జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా గేమ్ ఛేంజర్ ట్రైలర్‌ను లాంచ్ చేయగా నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో దూసుకెళ్తోంది. కాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శంకర్ మాట్లాడిన మాటలు అందరిలో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఇది అంటున్నారు.. కాదు.. రామ నవమి అని అన్నాడు శంకర్. అందరూ సంక్రాంతి ముందుందని అనుకుంటున్నారు. కానీ అది రామ్ నవమి కాబోతోందంటూ సినిమా ఎలా ఉండబోతుందో శంకర్ హింట్ ఇచ్చేశాడు. ఈవెంట్‌లో శంకర్ మాట్లాడుతూ.. సినిమాలో రాంచరణ్ అద్భుతంగా నటించాడు. సినిమాలో మీరు స్టార్‌ను కాదు.. పాత్రను మాత్రమే చూస్తారు. రాంచరణ్ స్క్రీన్ ప్రెజెన్స్ కోసమే జనాలు థియేటర్లకు వస్తారని భావిస్తున్నాను. చరణ్ ప్రతీ ఫ్రేమ్‌లోనూ అద్భుతంగా కనిపిస్తున్నాడు. రాంచరణ్ డిఫరెంట్ అవతారాల్లో కనిపించనున్నాడు. గేమ్‌ఛేంజర్‌లో ఐఎఎస్ పాత్ర కోసం గడ్డం లేని చిన్న హెయిర్‌స్టైల్‌ని కోరుకున్నాము. నేను అడిగిన ప్రతీ విషయాన్ని చేయడానికి చరణ్ ఒప్పుకున్నాడు. ఇక అప్పన్న పాత్ర గేమ్ ఛేంజర్‌కు గుండెకాయలాంటిది. సినిమా అంతా ఆంధ్రా సంస్కృతి ఉ ఒడేలా చూసుకున్నాం. ఆంధ్రా సంస్కృతిని తెరపైకి తీసుకురావడంలో ఆర్ట్ డైరెక్షన్ టీమ్ అద్భుతంగా పని చేసింది. రేసీ స్క్రీన్‌ప్లేతో ఈ సినిమా ఉంటుందని చెప్పుకొచ్చాడు. కడుపునిండా వంద ముద్దలు తిన్న ఏనుగు ఒక ముద్ద వదిలిపెడితే పెద్దగా దానికొచ్చే నష్టమేం లేదు. కానీ అది లక్ష చీమలకు ఆహారం నేను మిమ్మల్ని అడిగేది కూడా కేవలం ఆ ఒక్క ముద్ద మాత్రమే.. మా పార్టీ సేవ చేయడానికే కానీ సంపాదించడానికి కాదంటూ ట్రైలర్‌లో వచ్చే డైలాగ్స్ అందరినీ ఆలోచింపజేసేలా సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి.



## ఫుల్ స్టంటింగ్‌తో వస్తున్న బెల్లంకొండ శ్రీనివాస్

టాలీవుడ్ యాక్టర్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ యంగ్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి12. మిస్టిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. మహేశ్ చందు తెరకెక్కిస్తున్నారు. కాగా నేడు బెల్లంకొండ బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త పోస్టర్ ఒకటి షేర్ చేశారు. కొండపైన అటవీ ప్రాంతంలో గాలులు, మంటల మధ్య రైడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న లుక్ ఇప్పుడు నెట్టింటిని షేక్ చేస్తోంది. త్వరలోనే బిగ్ స్క్రీన్‌పై హై ఆక్టేన్ ఎక్స్‌పీరియన్స్‌ను ఫీల్ అయ్యేందుకు రెడీగా ఉండండి.. అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఈ మూవీలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

## మగాళ్లు శృంగారం చేయకండి : చిన్మయి శ్రీపాద



చిన్మయి శ్రీపాద.. ఈ పేరు అంటేనే కొంతమందికి హడల్, మరికొందరికి కోపం, చిరాకు ఇంకొందరికి ప్రేమ, అభిమానం. ఈ అభిప్రాయాలన్ని కేవలం ఆమె కళ సృజనాత్మకత గురించి మాత్రమే కాదు. ఆమె తనకంటూ ఒక అభిప్రాయం, స్టాండ్, పర్సనాలీటీని క్రియేట్ చేసుకున్నాక చాలా మందికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. బహిరంగంగాను, సోషల్ మీడియా ద్వారాను ఆమె సొసైటీలో మహిళలు పేస్ చేస్తున్న సమస్యలపై పోరాటం చేస్తుంటుంది. తాజాగా ఓ నెటిజన్ చేసిన ట్వీట్ కి దిమ్మదిరిగిపోయే కౌంటర్ ఇచ్చి మరోసారి వార్తల్లో నిలిచింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. 2024 సంవత్సరం పూర్తికావడంతో చాలా సంస్థలు వాళ్ళ సేల్స్, అచీవ్ మెంట్స్ తదితర అంశాలని షేర్ చేశాయి. ఈ నేపథ్యంలోనే.. ప్రముఖ హోమ్ డెలివరీ గ్రోసరీస్ సంస్థ బ్లింక్ ఇట్ సీఈఓ ఒక్క రోజులోనే తమ యాప్ ద్వారా లక్షకు పైగా కండోమ్స్ సేల్ చేసినట్లు ట్వీట్ చేశారు. ఈ క్రమంలోనే ఓ నెటిజెన్.. ఇలా అయితే వర్జిన్ అమ్మాయిలు భార్యలుగా దొరకడం కష్టమే.. అంటూ ట్వీట్ చేశాడు. దీనికి చిన్మయి స్పందిస్తూ.. “మగాళ్లు పెళ్ళికి ముందు అమ్మాయిలతో శృంగారం చేయడం ఆపండి. మీ అన్నదమ్ముల్ని, ఫ్రెండ్స్ ని పెళ్లి అయ్యేదాకా అలాంటి పని చేయొద్దని చెప్పండి” అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. దీంతో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది. మీటూ మూవ్‌మెంట్‌లో భాగంగా ప్రముఖ తమిళ గేయ రచయిత వైరముత్తు, పలువురు ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులపై ఆమె సంచలన కామెంట్స్ చేశారు. ఎందరో మహిళలలకు ఆమె అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నారు.

## మా నాన్న వల్ల నరకం చూశా : ఖుష్బూ



తన తండ్రి లైంగికంగా వేధించాడని ఎన్నో సందర్భాల్లో చెప్పుకొచ్చారు నటి జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ. తాజాగా ఇదే విషయంపై మరోసారి ఘాటుగా స్పందించారు. తండ్రి వల్ల తన కుటుంబంలో ఎన్నో సమస్యలు చూసిందని అన్నారు. “చిన్నతనంలోనే నేను లైంగిక దాడిని ఎదుర్కొన్నా. నా తండ్రే నాపై ఈ దారుణానికి పాల్పడ్డాడు. నా తల్లి, సోదరులను చిత్రహింసలు పెట్టేవాడు. బెల్టు, చెప్పులు, కర్ర.. ఇలా చేతికి ఏది దొరికితే దానితో కొట్టేవాడు. అమ్మను మరీ దారుణంగా హింసించేవాడు. ఆమె తలను గోడకు కొట్టేవాడు. చిన్నతనంలోనే నేను ఇలాంటి దారుణమైన వేధింపులు చూశా. నాపై జరుగుతున్న దాడి గురించి బయటకు చెబితే వాళ్లను ఇంకెంత నరకయాతనకు గురి చేస్తాడోనని భయపడేదాన్ని.. అందుకే మొదట్లో ఏమీ మాట్లాడలేక ఎన్నో దారుణాలు భరించా. చెన్నైకు వచ్చి నా కాళ్లపై నేను నిలబడిన తర్వాత నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. ఆ తర్వాతే ఆయనకు ఎదురు తిరగడం మొదలుపెట్టాను. దాన్ని ఆయన తట్టుకోలేకపోయాడు. షూట్‌కు వచ్చి అందరిముందు నన్ను బాగా కొట్టేవాడు. ఉబిన్ అనే ఒక హెయిర్‌డ్రెస్సర్ నాకెంతో సాయం చేసింది. నాతో ఆయన ప్రవర్తన సరిగ్గా లేదని ఆమె గుర్తించింది. ఆమె నాకు ధైర్యం చెప్పింది. అలా మొదటిసారి 14 ఏళ్ల వయసు ఉన్నప్పుడు లైంగిక వేధింపులు గురించి బయటకు వచ్చి మాట్లాడా. ఆ తర్వాత ఆయన మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్లాడో మాకు తెలియదు. నేను కనుక్కోవాలను కోలేదు. ఆ తర్వాత ఎప్పుడూ ఆయన్ని కలవలేదు. గతేడాది ఆయన మరణించాడని తెలిసినవాళ్లు చెప్పారు” అని ఖుష్బూ అన్నారు.



## నాన్న అలా అంటాడనుకోలేదు : కీర్తిసురేష్

హీరోయిన్ కీర్తి సురేశ్ ఇటీవల తన చిరకాల మిత్రుడు ఆంటోనిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల్లో వీరిద్దరి పెళ్లి జరిగింది. 15 ఏళ్ల ప్రేమకథను రోజుకో ఎపిసోడ్‌లాగా కీర్తి పంచుకుంటున్నారు. బేబీజాన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి విశేషాలను పంచుకున్నారు. ముఖ్యంగా క్రిస్టియన్ పద్ధతి గురించి మాట్లాడుతూ.. ఆంటోనీ కుటుంబ ఆచారాలకు అనుగుణంగా ఆ సంప్రదాయం లో పెళ్లి చేసుకున్నామన్నారు. “క్రిస్టియన్ సంప్రదాయంలోనూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాక మా నాన్నతో మాట్లాడాను. ‘నాన్నా.. ఈ సంప్రదాయం ప్రకారం వధువును ఆమె తండ్రి పెళ్లి వేదిక పైకి తీసుకురావాలి. నా కోసం మీరు కూడా ఆ విధంగా చేస్తారా?’ అని అడిగా. ‘తప్పకుండా చేస్తాను. మనం రెండు సంప్రదాయాల్లో వివాహం జరుపుతున్నాం. కాబట్టి నేను కూడా ఆ పద్ధతులు పాటిస్తాను’ అని ఆయన బదులిచ్చారు. ఆ మాట నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను చెప్పిన దానికి ఆయన అంగీకరిస్తారని అసలు ఊహించలేదు. కానీ ఆయన నా కోసం ఆ విధంగా చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది” అని కీర్తి సురేశ్ తెలిపారు. ఇటీవల బేబీజాన్ ఈవెంట్‌కు వెళ్లిన ఆమె పసుపుతాడు (మంగళసూత్రం)తో హాజరు కావడంపై ఆమె స్పందించారు.

“దక్షిణాదిలో ఒక సంప్రదాయం ఉంది. పెళ్లి సమయంలో వధువు మెడలో వరుడు పసుపుతాడు కడతాడు. దానిని వేమెంతో పవిత్రంగా భావిస్తాం. పెళ్లైన కొన్ని రోజులకు ఒక మంచి ముహూర్తం చూసి మంగళ సూత్రాలను బంగారు చైన్‌లోకి మార్చుకుంటాం. జనవరి చివరివరకూ మంచి రోజులు లేవు. అప్పటివరకూ నేను ఎక్కడికి వెళ్లినా పసుపు తాడు తో కనిపిస్తాను” అని తెలిపారు. ఆంటోనీ, కీర్తి 15 ఏళ్లగా ప్రేమలో ఉన్నారు. కీర్తి కంటే అతను ఏడేళ్ల పెద్దవాడు. అందరిలాగే రిలేషన్‌లో ఉన్నప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని కీర్తి చెప్పారు. కొవిడ్ సమయంలో కలిసి ఉన్నామని, 2022లో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నామని కీర్తి అన్నారు. పెద్దల అంగీకారంతో ఈ జంట డిసెంబర్‌లో వివాహబంధంలోకి అడుగుపెట్టింది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో గోవాలో పెళ్లి జరిగింది.



## ఏడాదిలోనే మహేష్‌బాబు సినిమా

రాజమౌళితో సినిమా అంటే ఎంత పెద్ద స్టార్ అయినా సై అనాల్సిందే. ఆ కాంబినేషన్ ఫ్యాన్స్‌కు పండగ. అయితే హీరో మాత్రం మినిమం మూడేళ్లు మరో పని లేకుండా లాక్ అయిపోవాల్సిందే. జక్కన్నతో సినిమా అంటే మరో మూడేళ్లు అభిమాన హీరో తెరపై కనిపించడనే భయం అభిమానులకు ఉంటుంది. రాజమౌళితో సినిమా ఫిక్సయితే, మినిమం మూడు నాలుగేళ్లు ఆ సినిమాకే అంకితం అయిపోవాలి. పండగలకు, ఇతర సెలబ్రేషన్‌లకు ఫస్ట్ లుక్, టీజర్, గ్లింప్స్ అంటూ ఏ హడావిడి ఉండదు. హీరోలు కూడా జక్కన్నకన కండీషన్స్‌కు రెడీ అయిపోతారు. ప్రస్తుతం మహేష్ బాబు రాజమౌళితో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది సూపర్‌స్టార్ ఫ్యాన్స్ అందరికీ సంబరమే. ఇప్పుడు మూడేళ్లు మహేశ్ జక్కన్న కాంపౌండ్‌లో లాక్ అయిపోయాడనే భయం వాళ్లలో ఉంటుంది. అయితే తాజాగా రామ్ చరణ్ మాటలు మహేష్ అభిమానుల చెవుల్లో అమృతం నింపినట్లయింది. ‘అన్నీ అనుకొన్నట్టు కుదిరితే.. ఏడాదిన్నరలో మహేష్ సినిమా వచ్చేస్తుంది’ అంటూ ‘గేమ్ ఛేంజర్’ ట్రైలర్ ఈవెంట్‌లో రామ్‌చరణ్ చెప్పారు. తను తెలిసి చెప్పాడో, తెలియక చెప్పాడో తెలీదు కానీ, ‘చరణ్ మాటలు నిజమైతే సూపర్‌గా ఉంటుంది’ అని ఫ్యాన్స్ దేవుళ్లను మొక్కేస్తున్నారు. అయితే చరణ్ మాటలను అంత లైట్ తీసుకోవలసిన పని లేదు. రాజమౌళి ప్లానింగ్ గురించి చరణ్‌కు బాగా తెలుసు. ‘బాహుబలి’, ‘ఆర్.ఆర్.ఆర్’ సినిమాల్లాగా మహేష్ సినిమా లేట్ కాకపోవొచ్చన్నది ఇన్ సైడ్ వర్గాల మాట. సినిమా థియేటర్లు ఈసారి రాజమౌళి ప్రీ ప్రొడక్షన్‌కి చాలా టైమ్ తీసుకున్నారు. ప్రొడక్షన్ మాత్రం చక చక పూర్తి చేయాలన్నది ఆయన ప్లాన్. నిజానికి లాక్ డౌన్ లేకపోతే ‘ఆర్.ఆర్.ఆర్’ కూడా చాలా త్వరగా పూర్తయ్యేది. కరోనా వల్ల ఆ సినిమా లేటయింది. 2026 చివర్లో మహేష్ ఎస్ఎస్ఎంబీ29 చిత్రాన్ని విడుదల చేయాలన్నది రాజమౌళి ప్లాన్. అయితే ఈ విషయాన్ని ఆయన బయటకు చెప్పడం లేదు. ఎందుకంటే ఓ రిలీజ్ డేట్ చెప్పడం, అది చేయి జారిపోవడం, మరో రిలీజ్ డేట్ ప్రకటించడం.. ఇలా కన్‌ఫ్యూజన్ సృష్టించడం జక్కన్నకు ఇష్టం లేదు. ‘ఆర్.ఆర్.ఆర్’కు రిలీజ్ డేట్లు చాలా మారాయి. ఈ సారి అలా కాకుండా ఉండాలనుకుంటున్నారు జక్కన్న. అంతే కాదు వీలైనంత లో ప్రొఫైల్‌గా ఉండాలని భావిస్తున్నారు. అందుకే ఎక్కడా ఈ సినిమా గురించి మాట్లాడటం లేదు.రాజమౌళి ఏ సినిమా మొదలుపెట్టినా ప్రెస్ మీట్ పెట్టి కథేంటో చెప్పడం అలవాటు. ఈ సారీ అదీ లేదు. ఎందుకంటే ఇప్పటికే సినిమా ప్రారంభానికి కొబ్బరికాయ కొట్టేశారు. రెగ్యులర్ షూటింగ్ మొదలెట్టే పనుల్లో ఉన్నారు.

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**